

శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!
అనంతకరుణామయుడు
అపారకృపాశీలుడు
సచ్చిదానందుడు
శాశ్వతానందస్వరూపుడు
సదానందుడు
సత్యకాముడు
సదానందుడు
సత్యకాముడు
అనంతకరుణామయుడు
అపారకృపాశీలుడు
అనంతకరుణామయుడు
అపారకృపాశీలుడు
సదానందుడు
సత్యకాముడు
అఖండ కళ్యాణగుణశీలుడు
సర్వోన్నత సౌందర్య విరాజితుడు
సచ్చిదానందుడు
శాశ్వతానందస్వరూపుడు
సదానందుడు
సత్యకాముడు
అఖండ కళ్యాణగుణశీలుడు
సర్వోన్నత సౌందర్య విరాజితుడు
గురుకృప
ఆరాధనోత్సవ సంచిక
శత వసంతాల సమాధానోత్సవం
సద్గురు చంద్రుల ఆరాధనా మహోత్సవం
గురుకృప వింశతి మహోత్సవం



## ఎదిగిన పిల్లలం...

**భక్తుడు :** మీరు తరచుగా గురువుకి, భక్తుడికి మధ్య సంబంధం తల్లికి, బిడ్డకి మధ్య ఉండే సంబంధం లాంటిది అని అంటారు. అయితే మేము ఎప్పటికీ ఒక బిడ్డగానే ఉండిపోతామా? అసలు ఈ బిడ్డ ఎప్పటికైనా ఎదుగుతుందంటారా, గురువుగారూ?

**గురువుగారు :** మనమంతా పిల్లలమే. ఎదిగిన పిల్లలం! (నవ్వులు) మీరు ఒప్పకున్నా, ఒప్పకోకపోయినా, మీకు నచ్చినా నచ్చకపోయినా మిమ్మల్ని నేను పిల్లల్లాగే చూస్తాను. ఓ బిడ్డ నిజంగా ఎప్పడు బిడ్డ అవుతుందంటే తల్లితో (ఆ బిడ్డకు) గల అనుబంధం వలన. బిడ్డకు నిస్సహాయత, అభద్రతాభావం ఉన్నప్పటికీ అవి ఆ రకంగా వ్యక్తం కావు. తల్లి ఇచ్చే సంరక్షణను బిడ్డ తన హక్కుగా భావిస్తుంది. తల్లిపై తనకు ఉండే ప్రేమ వలన ఆ సంరక్షణ పొందడం ఆ బిడ్డ హక్కు అవుతుంది. తల్లి పాలిచ్చినందుకు బిడ్డ ఎప్పడైనా కృతజ్ఞతలు చెప్తుందా? అయినా తనెందుకు చెబుతుంది? అది తల్లి యొక్క సహజ స్పందన. అక్కడ బిడ్డకు తన నిస్సహాయత కంటే తల్లి సంరక్షణే అనుభవము అవుతుంది. తల్లిగాని, తండ్రిగాని తనతో ఉన్నంతవరకు ఆ బిడ్డ వారిని ఎప్పడూ అంటిపెట్టుకొని ఉండి, నిశ్చింతగా ఉంటుంది.

**భక్తుడు :** అయితే నేను మీ సహాయాన్ని ఒక హక్కుగా కోరవచ్చన్నమాట!


**గురువుగారు :** నువ్వు పసిబిడ్డవనే భావం నీకుంటే! (గురువుగారు నవ్వుతూ)

-శ్రీబాబూజీ

సంపుటి : 20
సంచిక : 5

నవంబర్ 13
2017



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో




శరశ్చంద్రికలు – శ్రీబాబూజీ 5
జీవితం.. – శరశ్చంద్రికలు 8
కంచి పెద్ద స్వామి – సాయినాథుని శరత్‌బాబు 14
పదకవితా పితామహుని సద్గురు పదార్చన – కంద్రిక సూర్యనారాయణ 17
మనం ఎందుకోసం వచ్చాము? – శ్రీబాబూజీ 18
సద్గురుతత్వానికి ఆకారం శ్రీశరద్బాబూజీ! – సాయిదాసు 20
సమస్త అనుభవాలనిచ్చేది సద్గురు సన్నిధే! డా॥ఎస్. సాయి వరప్రసాదరావు 24
బాబాపైనే దృష్టి నిలుపు – శ్రీబాబూజీ 28


నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు

GURUKRUPA
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# కృతజ్ఞతా కుసుమం...

*ద్విదశాబ్ది మహోత్సవం*

సద్గురురాయా! మహాత్మా! మహర్షీ! కృతజ్ఞతా కుసుమాలతో మీ చరణాల చెంత అంజలి ఘటించి, ఆనందాతిరేకాల అక్షరాలతో మిమ్ము అర్చించి, కీర్తనా కీర్తులతో మీ కంఠ సీమన పూమాలను అలంకరించి, మా తనువంతా మీకై తపించి, పరవశించిన పదకుసుమాలతో పద్యమై, గద్యమై, హృద్యమై మీ పదాలను చేరాలని, మీ సన్నిధానాన సేదతీరాలని ఆశీర్వదించండి. 'గురుకృపా' జలధిలో వింశతి వసంతాలు - ఇరవై సంవత్సరాలు అనుగ్రహ విశేషంగా 'కాలగతి' తెలియకుండా గడిచిపోయాయి. ఎంతో ఉత్సాహంగా, ఉద్వేగంగా సాగిపోయిన సంవత్సరాలు మధురానుభూతులను అందిస్తూనే - సమయాన్ని సద్వినియోగం చేసుకొమ్మని, సద్గురువును తెలుసుకొమ్మని బాధ్యతను తెలియచేస్తున్నాయి.

'గురుకృప' పత్రికకు సారథి, వారధి, దేహం, ప్రాణం, రూపం, స్వరూపం, సమస్తమూ పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీనే. వింశతి వసంతాల ఈ ప్రయాణం - శ్రీవారు అభయమిచ్చి, ఆశీర్వదించి అప్రతిహతంగా సాగిపొమ్మని దీవించినదే! గురుదేవుల చెంతన జరిగే పర్వదిన వేడుకల విశేషాలను పంచుకునే పాత్తముగా ప్రారంభమయి, అనుభవాల మాలలుగా - గురుచరణాసక్తులకు ఆనందామృతాన్ని పంచుతూ, మహితాత్ముల, సద్భక్తుల పదముద్రలను, చరిత్రలుగా, శీర్షికలుగా దర్శించుకుంటూ సద్గురు చరణా గంగాజలాన్ని పంచుకుంటూ సాగిపోతోంది 'గురుకృప'. గురుబంధువులతో జరిగే సద్గోష్ఠిలో గురుదేవులు 'గురుకృప'తో మీ భావాలు పంచుకొమ్మని చెప్పిన క్రమంలో శ్రీవారితో జరిగిన సంఘటనలు, సత్సంగ సమాహారాలు గురుబంధువులు 'గురుకృప'తో పంచుకోవడం జరిగింది. అత్యానందంలో తప్పులు చేసిన రోజున గురువుగారు కోప్పడిన సందర్భాలు ఇంకా గురుతులుగా గుర్తొస్తున్నాయి. ఇరవై వసంతాల ఈ ప్రయాణంలో పత్రికతో ప్రయాణం చేసిన ప్రతీ గురుబంధువుకు "పత్రికను నిర్వహించడంలో తమకెట్టి అర్హత, ప్రతిభ లేవనీ, కేవలం గురుదేవుల కనుసన్నల్లో తాము పాత్రధారులమేనని - పత్రిక రావడం - కేవలం, కేవలం, కేవలం వారి అనుగ్రహ లీలా విలాసమేనన్నది స్వానుభవం".

చాలా సందర్భాలలో సకాలంలో శీర్షికలు పూర్తి చేయలేకనో, ముద్రణా సంస్థల పని ఒత్తిడి చేతనో, పత్రిక సకాలంలో రాదేమోనన్న శంకతో అడుగులు తడబడిన సందర్భాలు లేకపోలేదు. కానీ శ్రీవారి ఆశీర్వాదం - గురుబంధువుల చేతిలో అక్షరప్రసాదం - అవధులు లేని వారి కరుణా వినోదం - విరామం ఎరుగని సద్గురు చరణామృతపానం.

సద్గురు పదాలను చేరాలన్న తపనతో అడుగులు వేసే ప్రతీ మనిషికి, సద్గురుపథంలో - గురువును మార్గంగా, లక్ష్యంగా ఎంచుకొని, సాగే సద్భక్తునికి 'గురుకృప' ఊతమయితే చాలు. ఏ ఒక్క గురుబంధువు మదిలో నయినా సద్గురుచంద్రుల రూపం స్థిరమయ్యేందుకు 'గురుకృప'తోడయినా చాలు! గురుదేవుల ఆశీర్వాదం 'గురుకృప' పత్రికకు అందినట్లే. సద్గురు అనుగ్రహ 'ఫలం' చేతికందినట్లే!

సత్యసందర్శనాభిలాషులైన గురుబంధువులకు సభక్తిపూర్వక విన్నపము. గురువుగారితో మీకున్న ప్రతీ అనుభూతి మరో గురుబంధువులో ప్రేరణ కలిగించేదే! వారు మనలో వెలిగించిన ప్రేమ 'జ్యోతి'తో ఎన్నో చిరుదీపాలను వెలిగించవచ్చు. మీ అనుభవాలను, అనుభూతులను పంచడమే కాదు, గురుదేవులతో తొలినాళ్ళలో ఉన్న పెద్దల నుండి కూడా, అనుభవామృతపానం చేసి, 'గురుకృప'తో పంచుకోండి. గురుదేవులంటారు 'ప్రేమను పంచుకుంటే పెరుగుతుందని'.

గురుకృపాజలధి సకాలంలో గురుబంధువులకు చేరడంలో మా 'అమ్మ'గారి ఓర్పు, మా బంగారుతల్లి 'శృతి' నేర్పు ఇదంతా గురుదేవుల 'కూర్పు'. అవ్యాజమైన వారి ప్రేమానురాగాల గురించి ఎంత చెప్పకున్నా తక్కువే. సాయిపథ ఆదిదంపతుల ప్రతీ అడుగు ఆలోచనై, పల్లవించిన 'శృతు'లు పదముద్రలై సాయిపథ జగతి వర్ధిల్లి - సద్గురు చరణ కమలాలలో మనందరం శ్రద్ధాసక్తులమై ఆనంద జీవనయానం సాగించాలని ఆకాంక్షిస్తోంది 'గురుకృప'.

**సద్గురు చరణం శరణం**



## -: శరశ్చంద్రికలు :-

మనం ఎంత సమయం వృధా చేస్తున్నాము! దానిని వెనుకకు తీసుకురాగలరా! ముఖ్యంగా మీకు సంతోషం కలిగించని విషయాలలో మీ టైమ్‌ను వృధా చేసుకోవద్దు. "మీరు సమయాన్ని వృధా చేసుకోవద్దు. మిమ్మల్ని మీరు బాబాకు అంకితం చేసుకోండి" అని నేను చెప్పడం లేదు. మీ దృష్టిలో ఏది ఆనందం అనుకుంటున్నారో, కనీసం అలా అయినా ఉండటానికి ప్రయత్నించండి. మీరు ఇండియా నుండి రెండు మూడు రోజులలో మీమీ దేశాలకు వెళతారనగా మీరెలా ఉంటారు? "సత్సంగం చేసుకోవాలి, దర్శనం చేసుకోవాలి, ఎంత వీలైతే అంతగా ఉపయోగపెట్టుకోవాలి" అని అనుకుంటారు. మీరు ఇలా అనుకోవడానికి కారణం మీరు వెళ్ళిపోతున్నారని మీకు తెలుసు. కానీ మన జీవితం మొత్తం ఒక ప్రయాణమని, మనం ఎప్పుడు వెళ్ళిపోవాలో ముందే నిర్ణయం అయిపోయిందన్న విషయాన్ని మీరు మర్చిపోతున్నారు. దాని సంగతేంటి?

భాగవతంలో "కారే రాజులు రాజ్యముల్ గలుగరే? వారేరీ సిరి మూటగట్టుకొని పోవంజాలరే?" అనే పద్యముంది. ఎందరో రాజులు మహా మహా సామ్రాజ్యాలను ఏలారు. వారంతా ఇప్పుడేరి? వాళ్ళు పోయేటప్పుడు వారి సామ్రాజ్యాలను వారితో పట్టుకెళ్ళగలిగారా? ఈ విషయం తెలిసీ, చరిత్ర చదువుకొని కూడా మీరింకా శాశ్వతంగా ఉంటారనుకుంటున్నారు. బహుశా ఇందుకేనేమో నాకు చరిత్ర అంటే ఇష్టం. అది నాకు ఇష్టమైన సబ్జెక్టు. ఎందుకంటే చరిత్ర మనకు ప్రతి విషయం ఎంత అనిత్యమో, అశాశ్వతమో తెలియచేస్తుంది. నాకు చరిత్ర – ఒక వేదం, ఉపనిషత్తు, పురాణం, ఆధ్యాత్మికతత్త్వం వంటిది. మనకు జీవితం యొక్క అశాశ్వత తత్త్వం గురించి చరిత్రకన్నా బాగా బోధించేది ఏముంటుంది? ఒక్కసారి ఆలోచించండి.

ఈ కాస్త సమయంలో మనమెన్నో సమస్యలు సృష్టించుకుంటాం. సంబంధ బాంధవ్యాలలో సమస్యలు, ఒకరితో ఒకరు పోట్లాడుకోవడాలు, ఇలాంటివెన్నో! భారీ ఎత్తున డబ్బులు సంపాదించడానికి, ఆస్తిపాస్తులు కూడబెట్టుకోవడానికి ప్రయత్నిస్తాం. స్థలాలు కొనడం, ఇళ్ళు కట్టుకోవడం, వాటన్నింటినీ మీ సృష్టిలాగా చూడటం, వాటితో అనుబంధాన్ని పెంచుకోవడం, ఇవన్నీ నిజంగా అవసరమా? నిజంగా అది తెలివైన పనేనా? నాకు మిగతా అన్నింటికన్నా, అన్నీ అశాశ్వతం



అనే విషయాన్ని గుర్తుపెట్టుకోవడం, ఆ ఎరుకలో ఉండటం సరిపోతుందనిపిస్తుంది. మిగతా శాస్త్రాలేవీ అవసరం లేదు. ఈ విషయం తెలియచేయడానికి మీకు ఏ గురువూ అవసరం లేదు. ఈ సత్యం కంటిముందే కనిపిస్తుంది. దానిపట్ల ఎరుకతో ఉంటే ఈ ప్రపంచం పట్ల, విషయాలపట్ల, మీ వ్యక్తిత్వం పట్ల మీ దృక్పథం ఎలా మారుతుందో గమనించండి.

నాతో మీకు గల అనుబంధాన్ని కేవలం ఈ అరగంటకో, అయిదు నిమిషాలకో లేదా ఓ గంటకో పరిమితం చెయ్యకండి. దాన్ని మరింత విస్తృతం చేసుకోవడానికి ప్రయత్నించండి. అప్పుడు, మీరు ఇక్కడ ఎందుకున్నారు, ఏం చెయ్యాలి అన్న విషయం అవగతమవుతుంది. **ఏ విషయాన్నైనా మీరు సంపూర్ణంగా అనుభవించగలిగేటట్లు, అది జరిగిపోయిన తక్షణమే దానికి సంబంధించిన ఎటువంటి చిహ్నాలు మనసులో లేకుండా ఉండేటువంటి మనఃస్థితిని పొందేందుకు ప్రయత్నించండి.**

మనం ఎప్పుడూ ఆనందంగా ఉండటం, సాయిపథంలో ఉన్నట్లు లెక్క. హ్యాపీగా ఉండండి. దుఃఖం వస్తూ ఉంటుంది. డిస్టర్బ్ అవుతూ ఉంటాం. ఎందుకు డిస్టర్బ్ అవుతున్నాం మనం. ఇది నిజంగా సమంజసమేనా? నిజంగా అవసరం ఉందా? నిజంగా అంత కష్టం వచ్చిందా నాకు? అని ఆలోచించుకోండి. వెళ్ళిపోతుంది, మళ్ళీ వస్తుంది. మళ్ళీ ఆలోచించుకోండి. పోతుంది. ఈ విచక్షణ కావాలి. ఆ థింకింగ్ కావాలి. ఆ వివేకం కావాలి. అది నిజమైన సత్సంగం అంటే.

మనం ఇక్కడ ఎందుకున్నాం అనే విషయాన్ని గుర్తుపెట్టుకోవడానికి ప్రయత్నించండి. మనం ఏం పొందుతున్నాం? మనం ఇక్కడకు ఎందుకు వచ్చాం అని చెబుతున్నామో దానికి తగినట్లుగా మన ఆచరణ ఉందా? ఆ అనుభవాన్ని ఇంకా ఇంకా గొప్పగా అనుభూతి చెందడానికి ఇంకా గొప్పగా వ్యక్తం చేయడానికి మనం ఎటువంటి మార్గాలలో ప్రయత్నించాలి. ఈ విషయాలను గుర్తు పెట్టుకోవడానికి ప్రయత్నించండి.

నా దృష్టిలో ధైర్యవంతంగా జీవించడం అంటే మనల్ని మనం ఎదుర్కోవడమే. నిజాయితీగా, ఆత్మవంచన లేకుండా, మనల్ని మనం మభ్యపెట్టుకోకుండా మనమంటే ఏమిటి అని తెలుసుకోవడం. అదే నా దృష్టిలో అత్యంత ధైర్యవంతమైన జీవితం. నువ్వెవరో తెలుసుకోవడానికి పెద్దగా పరిశ్రమించవలసిన అవసరం లేదు. నువ్వు ఎవరో, ఎక్కడున్నావో బాబా నీకు అనుక్షణం చూపుతూనే



ఉన్నారు. మనమే దానిని చూడటం లేదు. నువ్వేమిటో చూసుకో.

అన్నింటికంటే ముఖ్యమైనది “నేను బాబాకు చెందినవాడిని, బాబా నావాడు”, అనేటువంటి ఆ అనుబంధం, ఆ అనుభవం, ఆ గుర్తింపు అది చాలు! దానిని నీవు గుర్తుపెట్టుకున్నంతవరకు అదే నిజమైన స్మరణ అవుతుంది. స్మరణ అంటే గుర్తుపెట్టుకోవడం.

మనం ఆయనకోసం పడేటువంటి ఆర్తి కంటే కూడాను, ఆయన మనపట్ల పడేటువంటి ఆర్తి ఎక్కువ. ముందు మనల్ని ఆయనే చూస్తారు. ఆ తరువాతే మనం ఆయనను చూస్తాము. ఆయన అనుగ్రహ దృష్టే మనమీద పడుతుంది. మన గురించి మనకంటే ఎక్కువ ఆయనే తాపత్రయ పడుతున్నాడు. కాబట్టి మన హృదయం చుట్టూ తిరిగేటువంటి తుమ్మెదలాంటివాడు ఆయన అని చెప్పానన్నమాట.

సాయి అభయం మనస్సులో నిలుపుకొని, మన ఆచరణను మలచుకోవాలి. వెంపర్లాటలేని జీవితాన్ని ఆస్వాదించడానికి ఆయత్తమవ్వాలి. ప్రతి అంశాన్ని నిత్యజీవితంలో సాయిపరంగా సమన్వయం చేసుకోవాలి. అదే నిజమైన సాధన.

మనస్సును ఏకాగ్రం చేయడానికి నేను వ్యతిరేకం కానప్పటికీ నేను దానికి అంత ప్రాముఖ్యతనివ్వను. **నేను హృదయానికి, భావోద్వేగానికి, ప్రేమకు ప్రాధాన్యతనిస్తాను.** మన భావోద్వేగం ఎక్కడ బలంగా ఉంటుందో అక్కడ మన మనస్సు అప్రయత్నంగానే లగ్నమవుతుంది. ప్రేమ నుండి ఏకాగ్రత వస్తుంది. మీరు బాబాను ఒకసారి నిజంగా ప్రేమించడం మొదలుపెడితే మీ ఆలోచనలన్నీ ఎప్పుడూ బాబా మీదనే కేంద్రీకృతమవుతాయి.

నిరంతర సాంగత్యం వలన అనుబంధం, ప్రేమ పెరుగుతాయి. మీకు అనుభవమైన ఆ ప్రేమను, ఆ మిణుకుమిణుకుమనే చిన్న దీపం లాంటి ప్రేమను నిలుపుకోవడానికి నిరంతర సాంగత్యం అవసరం. మీరు చాలా రకాలుగా ఆ సాంగత్యంలో ఉండవచ్చు.

బాబా మీకిచ్చిన అందమైన జీవితాన్ని అర్థం చేసుకొని, (గుర్తెరిగి) ఆనందంగా ఉండటానికి ప్రయత్నించండి.

ఆనందానికి అందరూ అర్హులే. అందరూ సమర్థులే. అందరూ అన్వేషిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఆ



అన్వేషణ కొనసాగిస్తే, అన్వేషణలో నిజాయితీ ఉంటే అందరూ దానిని తప్పక పొందితీరుతారు.

**ఉల్లాసంగా బాబా అనే ఆనందంతో పొంగిపోండి. ఆ ఆనందాన్ని నేను చూడాలి. ఆ సంతోషం చూస్తే నేనూ సంతోషపడతాను. బాబా అనే ప్రేమలో, ప్రేమ అనే ఆ ఆనందంతో ప్రకాశిస్తూ మీ అందరి ముఖారవిందాలు విప్పారి ఉంటాయి. బాబా మీవాడన్న నమ్మకము, నీవు బాబాకు చెందినవాడవన్న అనన్యతము ఉన్న ఆ రాజసం ఉండాలి. – శ్రీబాబూజీ**

## జీవితం

**భక్తుడు** : పారమార్థిక జీవితము, ప్రాపంచిక జీవితము వేర్వేరా? మనం వాటినెలా సమన్వయ పరచుకోగలం?

**గురువుగారు** : వాస్తవానికి రెండు జీవితాలంటూ ఏమీ లేవు. నీవు జీవించేది ఒక జీవితాన్నే. అది పారమార్థికమా, ప్రాపంచికమా అనే నిర్ణయం నీ లక్ష్యం, నీ గమ్యం. ఇంకా దేని నుండి నీవు నీ ఆనందాన్ని పొందుతున్నావో ఆ మూలకారణం మీద ఆధారపడి ఉంటుంది. ఒకవేళ నీవు ఆనందం లౌకిక విషయంగా పొందితే దానిని నీవు ప్రాపంచిక జీవితమని, ఇంకా మనము పారమార్థిక కారణాలనుకొనే వాటివలన పొందితే దానిని ఆధ్యాత్మిక జీవితమని అంటావు. బాబా ఈ రెండింటి మధ్య బేధాన్ని ఎప్పుడూ చూడలేదు. మనుషులంతా ఎందుకోసం పాటుపడుతున్నారో, ఒక మనిషి ప్రయాసకు ఆధారమైన నిజమైన మూలకారణమేమిటో ఆయన చూశారు. అది లౌకికంగా కానీ, పారమార్థికమైన ప్రయత్నం కానీ, అసలు ప్రజలెందుకు ఆరాటపడతారు? అది ఆనందం కోసం, తృప్తి కోసం!

సాధారణంగా ప్రాపంచిక విషయాలద్వారా మాత్రమే ఆనందం వస్తుందని అందరూ అనుకుంటారు. ఒకవేళ, "లేదు లేదు! అది ఆనందం కాదు!" అని ఎవరైనా వాళ్ళతో చెప్పినా కూడా వాళ్ళు ఇంకా దానిని ఆనందంగానే అనుభవం పొందుతుంటారు. వాళ్ళు డబ్బు కావాలనుకొంటారు, లేదా వాళ్ళకో సమస్య ఉంది. అది తీరితేగానీ వాళ్ళు ఆనందంగా ఉండలేరు. నీవొకవేళ, "ఇదంతా మాయ, నిజమైన ఆనందం ఆవల ఎక్కడో ఉంటుంది" అని అంటే గౌరవం కొద్దీ వాళ్ళు వింటే వింటారేమోగాని అది వాళ్ళకు హృదయగతం కాదు. అదీగాక అసలు వాళ్ళకది నిజంగా అర్థమవదు. కనుక బాబా



**ప్రేమ అనేది ఆనందం ఉండటం వలన కలిగే అనుభవం -శ్రీబాబూజీ**



ఏం చేస్తారంటే మొదట మన కోరికలను తమ శక్తితో తీరుస్తారు. ఒకసారి మన ఆనందానికి బాబా మూలమని తెలిసిన తర్వాత మన దృష్టి చిన్నగా అసలు కోరికకు కారణమైన వస్తువు నుంచి ఎవరైతే దాన్ని ఇస్తారో వారి (బాబా) మీదకు మరలుతుంది.

మనం ఆనందాన్ని విభిన్న విషయాల (కారణాల) ద్వారా పొందుతుంటాము. ఎప్పుడైతే ఇవన్నీ ఇవ్వగల సద్గురువనే ఒక ఆధారం దొరికిందో మన మనస్సు ఇంకా ఇంకా ఆయనపై లగ్నం కావడం మొదలవుతుంది. అప్పుడు ఆయనపట్ల మన ప్రేమ పెరిగేకొద్దీ ఇతర విషయాలపట్ల ఆకర్షణ చిన్నగా క్రమంగా బలహీనపడుతూ పోయి ఒక్క సద్గురువు పట్ల గల ఆకర్షణ మాత్రమే మిగులుతుంది.

**భక్తుడు :** గురువుగారూ! దైనందిన జీవితంలో ఆధ్యాత్మికతను మనం ఎలా ఒక భాగం చేసుకోగలం?

**గురువుగారు :** నీవెందుకు జీవితాన్ని ఆధ్యాత్మికమైనది, ఆధ్యాత్మికము కానిది అని విభజిస్తావు? ఎందుకు ఈ కృత్రిమమైన విభజన చేసి ఒకదానికి ఎక్కువ, మరోదానికి తక్కువ విలువనిస్తావు? జీవితం జీవితమే. అందుకని మన దైనందిన జీవితంలో ఆధ్యాత్మికతను ఒక భాగం చేసుకోవడమన్న ప్రశ్నే లేదు. సాధన అనేది మన జీవితంలో భాగం కావడంగాక మన జీవితమంతా మన సాధనలో భాగం కావాలి. ప్రతిరోజూ ఓ గంట ధ్యానం అని మనం దానికని కేటాయించిన ప్రత్యేకమైన సమయంలోనే కాకుండా రోజుకు 24 గంటలు ఆధ్యాత్మిక సాధన సంభవమవ్వాలి. మనకు నేర్చుకోవాలనే అభిలాషే (దృక్పథమే) ఉంటే నిత్య జీవితంలోని ప్రతి సందర్భాన్ని సాధనగా చూడగలం, ఉపయోగించుకోగలం. అది ప్రపంచాన్నంతా గురువులాగా భావించడం, జీవితాన్నంతా గురువుగా చూడటం, ప్రతి విషయం నుంచి, ప్రతి వ్యక్తి నుంచీ నేర్చుకోవడం, అందుకని మౌలికంగా ప్రాపంచికము, పారమార్థికము అనే తేడా ఏమీ లేదు. అదంతా మన స్వభావం (వైఖరి) మీద ఆధారపడుతుంది. ప్రాపంచికమైన ఒకానొక విషయం ఆధ్యాత్మికం కావచ్చు, ఆధ్యాత్మికమైన ఏదో ఒక విషయం ఫక్తు ప్రాపంచికమూ కావచ్చు.

మీకు ప్రపంచం పట్ల వ్యామోహం ఉంది కనుక దానిని మీ ఆధ్యాత్మికగమ్యాన్ని పొందే ఒక సాధనంగా మలుచుకోండి. అప్పుడు ప్రపంచమంతా దానికి (ఆధ్యాత్మిక గమ్యానికి) మార్గమవుతుంది. సాధారణంగా ఒక సాధకునికి ప్రపంచమంతా ఒక అడ్డంకిగా, ఒక శత్రువుగా, ఒక పీడకలగా



పరిగణింపబడితే, అదే ఒక సాయిభక్తునికి మాత్రం అతని గమ్యానికి అతనిని మరింత మరింత దగ్గరగా తీసుకువచ్చే ఒక సాధనమవుతుంది. ఉదాహరణకు మనకు జబ్బు చేసినప్పుడు, చాలా ఆధ్యాత్మికవర్గాల్లో దానిని గురించి పట్టించుకోకూడదనుకోవడం జరుగుతుంది. దానితో మన సాధనకుగానీ, మన సద్గురువుకుగానీ ఎలాంటి సంబంధం ఉండదు. "నీవు శరీరం కాదు, ఈ జబ్బు గురించి ఆందోళనపడవద్దు. ఆత్మ మీద మనస్సు లగ్నం చేయి" అని గురువు నీకు చెబుతాడు. కానీ మనము మన అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ ఉంటాము. అందుకని మనకు మనం "మనం శరీరం కాదు" అని చెప్పుకుంటాం. కానీ అదే సమయంలో అనారోగ్యం గురించి బాధపడుతుంటాము. అందుకని ఒక సంఘర్షణ ఏర్పడుతుంది. కానీ ఒక సాయిభక్తుని విషయంలో అతను జబ్బు పడితే అతనికి నయమవడానికి బాబా దగ్గరకే వెళతాడు. అప్పుడు ఒకసారి అతను తేటపడితే "ఓ! బాబా నాకు నయం చేసారు!" అని అనుకుంటాడు. మామూలుగా ఒక అడ్డంకిలా కనిపించే ఆ శరీరమే, చివరకు జబ్బు కూడా, అతనికి సద్గురువుకు మరింత చేరువవడానికి సాధనమవుతుంది.

విషయాలను ఈ విధంగా చూడటం ద్వారా, మన జీవితమంతా మన సద్గురువుపట్ల మన ప్రేమను వ్యక్తీకరించే విధంగా చేసుకోవచ్చు. అది ఏ మాత్రం లాంఛనప్రాయమైన అలవాటుగా అనిపించక మనలోకి ప్రేమస్ఫూర్తిని ఊపిరులూదే నిరంతరమైన, అనంతమైన (శ్రద్ధతో కూడిన) **ఆరాధన.** నీ జీవితమంతా ఆధ్యాత్మిక సాధనలో భాగం కావాలి అనడంలో నా ఉద్దేశ్యం అదే.

***– శరశ్చంద్రికలు 2011***

***భక్తుడు :*** గురువుగారూ! పరమానంద స్థితి అంటే ఏమిటి?

***గురువుగారు :*** ఏ లోటూ, ఏ అవసరమూ లేని స్థితి. పరిపూర్ణత, ఆనందం, అన్నీ ఉన్నాయన్న అనుభవం. తమ గురువుమీద కేంద్రీకృతం చేసి పన్నెండు సంవత్సరాలపాటు గురువును అంటి పెట్టుకోగలిగిన సామర్థ్యం ఉన్న శ్రీసాయిబాబా వంటి వారికి అలాంటి అనుభవం సాధ్యమవుతుంది. ఆ అనుభవం మనకు కూడా లేశమాత్రంగా వివిధ మార్గాలలో రావచ్చు. కొంతమందికి సద్గురువు – "ఇక్కడ మనం ఏదో పొందుతాము" అనే భావాన్ని వారి హృదయంలో కలిగిస్తారు. అది ఒక రకమైన భరోసా, ఆనందభావన, వర్ణనాతీతమైన, నిగూఢమైన ఆకర్షణ – అది మనం ఆ ఆనందాన్ని పొందగలమనిపించే హామీ కాని హామీ. దానినే నేను "అస్పష్టంగా, అవ్యక్తంగా ఉండే సంపూర్ణత భావన" అంటాను. ఆ భావనకు సద్గురువు స్పష్టమైన ప్రతిరూపం. ***– శ్రీబాబూజీ***



**ఇతరుల నుంచి ఏమీ ఆశిస్తావో, దానిని నువ్వు ముందు ఇతరులకు చేయాలి**

సాయినాథుని శరత్‌బాబు
Sainathuni Sarath Babu

SAIPATHAM ASHRAM
[illegible],
Pimpalwadi Road,
SHIRDI-423 109, M.S.

తేది: 27.04.1992

శ్రీ ప్రియమైన సాయి వరప్రసాదరావు గారికి,

సద్గురు సాయినాథుడు సర్వులను అనుగ్రహించుగాక!
మీరు ప్రేమాభిమానాలతో వ్రాసిన ఉత్తరాలన్నీ అందినవి. ఆ ఉత్తరాల అసలు చిరునామాదారుడైన శ్రీ సాయినాథునికే ఆ లేఖలన్నీ forward చెయ్యడం (నివేదించడం) జరిగింది.

సాధనకు సత్సంగం ఊపిరి. ఆ ఊపిరి పోసేవాడు సద్గురు సాయినాథుడు. అటు వెంకటగిరిలోను ఇటు తెనాలిలోను మీరందరూ శ్రద్ధాభక్తులతో నిర్వహిస్తున్న సత్సంగాలు శ్రీసాయి కృపావిశేష విశేషాలు. శ్రీసాయి సంకల్పం వుంటే సాధ్యం కానిదేమున్నది? అన్నింటా అన్నివేళలా బాబానే మనకు కలిమి బలిమి.

ఒక గంట క్రితం శ్రీ SVL నారాయణ రావు గారు వ్రాసిన ఉత్తరం అందినది. అందులో, ఆయన [illegible] తెనాలి సత్సంగంలో పాల్గొన్నప్పటి విశేషాల గురించి వ్రాశారు. అందులోని సంగతులు నాకెంతో సంతోషం కలిగించాయి — ఒకటి విషయం తప్ప. "శ్రీ సద్గురు సాయినాథుని శరత్‌బాబుగారి సత్సంగ సేవా సమితి" పేర సత్సంగం జరుపుకుంటున్నారు." అని వారు ఉత్తరంలో వ్రాశారు. ఆయన అదెంతో సగర్వంగాను సంతోషంగాను వ్రాసిన మాట. కాని ఆ విషయం నాకెంతో బాధ కలిగించింది. ఇంతవరకు మీరెవ్వరూ ఈ విషయాన్ని నాకెందుకు తెలుపలేదో అర్థం కావటంలేదు. SVL గారి ఉత్తరం చదవగానే మీకీ ఉత్తరం [illegible] వ్రాస్తున్నాను.
నా బోటి వాడికి కూడా 'సద్గురు' పదవిని బహూకరించి, నా పేర ఒక సత్సంగ సేవా సమితిని ప్రారంభించడం

- 2 -

నిజంగా శోచనీయం. అభిమానానికి కూడా ఒక అంతముండాలేమో! ఆత్మ వికాసానికి సకల పురుషార్థ సాధనకు సాధనమైన సత్సంగాలు వ్యక్తిపూజను ప్రోత్సహించే 'అభిమాన సంఘాలు' కారాదు. నా దృష్టిలో 'సద్గురు' పదవాచ్యుడు ఆ సాయినాథుడొక్కడే. మీ అందరి దృష్టి అదే కావాలన్నది నా ఆకాంక్ష. మనకొకవేళ ఆ దృష్టి లోపించి ఉంటే, మనం చేసే సత్సంగాలు మనకా దృష్టిని ప్రసాదించాలి. "కారు కారు గురువులు 'కా' గుణింతము చెప్పు" అన్న పెద్దల వివేకోక్తి. ఆత్మ విద్యలో 'అ ఆ'లు కూడా సరిగా తెలియ చెప్పడం తెలుసో లేదో నన్న విషయం కూడా సరిగా తెలియని నేనా సద్గురువునా?! మనం ఆశించవలసింది సద్గురు పథాన్ని మనం సద్గురు పదాన్ని గాని, సద్గురు పదవిని కాదు. మనకా దృష్టిని కలిగించలేక పోగా, ఇలాంటి విపరీత దృక్పథానికి నిమిత్తమైనానంటే, తప్పక ఆ దోషం నాలోనే ఉండి ఉండాలి. ఇది అవశ్యం నేను ఆత్మపరిశీలన చేసుకోవలసిన అంశం. నా సద్గురునాథుడే నాలోని ఆ లోపాన్ని పరిహరించాలి.

శ్రద్ధ సబూరీలతో నియమంగా సత్సంగం చేసుకొమ్మని నేను మిమ్మల్నందరినీ అభ్యర్థించాను. ఆ అభ్యర్థన వెనుక వున్న నా 'అభిమతాన్ని' గూడా 'మీకు' ఇంకా స్పష్టంగా చెప్పడం నా విధి. చెబుతున్నాను.—

— అందరి నోట సాయినామం పలకాలి; అంతటా సాయి రూపం రంజిల్లాలి; ముజ్జగాలు సాయి మహిమలతో ముప్పిరిగొనాలి; సాయి పద రవళులు మన హృదయకుహరంలోని నిక్షిప్త నిధులై ప్రతిధ్వనించాలి; సాయి జ్ఞాన సౌరభాలు సర్వత్రా వ్యాపించాలి; ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో మన మనసులు మత్తేకావాలి; సాయి ప్రేమామృత ధారలు

సాయినాథుని శరత్‌బాబు
Sainathuni Sarath Babu

Flat No. 6, Pukhraj Loda Apartments,
Pimpalwadi Road,
SHIRDI-423 109, M.S.

- 3 -

అంతట నిరంతరం వర్షించాలి. ఆ
ప్రేమామృత ధారలలో తడుస్తూ, జ్ఞాన
ప్రాభాల ముత్యాలు ఆనందంగా నర్తిస్తూ,
'సాయి వంటి దైవంబు లేదోయి! లేదోయి!!'
అని అందరూ ఏక కంఠంతో గానం చెయ్యాలి.
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష. అదొక
మధుర స్వప్నం. ఆ స్వప్న సాఫల్యం కోసం
శ్రీ సాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది; —
చెయ్యవలసింది.

మన సత్సంగ సభ్యులందరినీ సక్రమైన
సాయి సన్నిధిలో నడిపించమని బాబాను ప్రార్థిస్తూ,

సాయి సేవలో
సాయినాథుని శరత్‌బాబు

P.S. ఈ ఉత్తరంలో ఓ నాలుగు పంక్తులు
వ్రాశానో లేదో - చిత్రంగా సమయానికి —
తెనాలి సత్సంగ సభ్యులొకరు వచ్చారు.
వారి ద్వారానే ఈ ఉత్తరం పంపుతున్నాను.
సాయి లీలలు అనంతాలు; అగమ్యాలు.
కొన్ని మాసాల క్రితం తెనాలి సత్సంగ సభ్యు
లెవరో తమ సత్సంగానికి ఒక 'సందేశం'
ఇవ్వమని నన్ను కోరారు. అప్పుడు
నాకే సందేశమూ స్ఫురించలేదు.
ఇప్పుడు ఈ ఉత్తరాన్నే 'సాయి సందేశం'గా
మీరందరూ సమాదరించగలరని ఆశిస్తున్నాను.

# సజ్జన హృదయపీఠాధిపతి
# కంచి పెద్ద స్వామి



'పెరియవర్ (పెద్దాయన) అనీ, 'నడమడం దైవం' (నడయాడే దైవం) అనీ లక్షలాదిమంది భక్తులు ఆయన్ను గురించి ప్రేమగా ప్రస్తావిస్తారు. వేదశాస్త్ర పురాణేతిహాసాలలో ఆయనకు అధికారికమైన పాండిత్యం ఉంది. అన్ని దేశభాషలలోనే కాకుండా, కొన్ని విదేశీ భాషలలో కూడా విశేష పరిజ్ఞానం కల బహుభాషా కోవిదుడు, భాషావేత్త. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఆయా రంగాలలో నిష్ణాతులైన పండితులు ఎందరో తమ తమ రంగాలలో తమకుగలిగిన సందేహాలను నివృత్తి చేసుకొనేందుకు వారిని ఆశ్రయిస్తుంటారు. కానీ, వారు మాత్రం ఎక్కడికి వెళ్లినా, ఎవరు వారి దర్శనానికి వచ్చినా, ఆ సందర్శకులను వారి వారి రంగాలలో ఎంతో ఆసక్తితో, వినయంతో విషయ గ్రహణ చేస్తూ, తమకున్న పరిజ్ఞానాన్ని ఇంకా పటిష్టం చేసుకోవడం మాత్రం మానరు. బహుశా అందుకే వారు ఒక "విజ్ఞాన సర్వస్వం"గా (Encyclopedia) భాసిల్లుతున్నారు. అన్నింటికీ మించి వారు పొందిన మహోన్నత ఆధ్యాత్మిక స్థితి. అది వారి సన్నిధిలో కొంతసేపు స్థిరంగా ధ్యానం చేసుకుంటే ఎవరికైనా ఇట్టే అనుభవమవుతుంది. ఒక్క మాటలో శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అయిన సద్గురువుకు వారు నిదర్శనమనిపిస్తుంది.

సామాజికంగా ఆయనొక ప్రఖ్యాత సనాతనపీఠానికి అధిపతి, సన్యాసి. ప్రస్తుతం పంచమాశ్రమంలో ఉన్న అవధూత. ఆధ్యాత్మిక దృష్టిలో ఆయనొక గొప్ప జ్ఞాని, సిద్ధపురుషుడు. ఇంతకూ ఆయనెవరో కాదు – కంచి శంకరాచార్య పీఠం పరమాచార్య శ్రీచంద్రశేఖర సరస్వతీస్వామి.

ఆయన పొందుతున్న ఈ అభిమానం, గౌరవం ఆయన స్వార్జితమేగానీ, కేవలం ఒక పీఠాధిపతి అవటం వల్ల సంక్రమించింది కాదు. ఎన్నో కారణాల వల్ల ఆదిశంకరులలోనయినా దోషాలు చూపే వారున్నారు కానీ, శ్రీస్వామివారిని మాత్రం విమర్శించ సాహసించలేరు.

తమనెవరైనా ఆహ్వానిస్తే 'పాదపూజ', 'భిక్ష'కు 'గ్యారంటీ' ఇస్తేగానీ పాదం మోపమని మొరాయించే మఠాధిపతులను చూస్తుంటే ఆ మఠాధిపతుల కోవలో శ్రీస్వామివారు విజాతీయులా అని అనిపిస్తుంది. తాము అధివసించిన పీఠం యొక్క నియమాలకు తలవొగ్గి అట్టహాసంతో కూడిన మందీ మార్బలం మధ్య ఒక్కోసారి వారు కనిపించినా, వ్యక్తిగతంగా వారు ఎంత నిరాడంబరులో, ఎంతో సాత్వికమైన



ఆహారాన్ని, ఎంత మితంగా భుజిస్తారో, ఎంత తక్కువగా నిద్రిస్తారో చూస్తే ఆశ్చర్యమేస్తుంది. ఆయన నిరాడంబర జీవనం, సాధువర్తనం, సన్యాసులకు, సాధువులకు ఆదర్శప్రాయం. మహాత్ముల ధర్మాచరణకు ప్రతీక. ఇంత వయస్సులో కూడా (ఇప్పుడు వారి వయస్సు 95 సంవత్సరాలు) ఎన్నో సంవత్సరాల క్రితం జరిగిన సంఘటనలు, వేలాది భక్తుల పేర్లు, వారి కుటుంబ వివరాలు పొల్లు పోకుండా చెప్పగలిగే వారి జ్ఞాపకశక్తి మరో అద్భుతం.

శ్రీస్వామివారు 1894లో (ఆదివారం మే 20వ తేదీన) తమిళనాడులోని విల్లుపురంలో జన్మించారు. పూర్వాశ్రమ నామం స్వామినాథన్. 1907లో అంటే తమ 13వ ఏట – శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి పేరుతో సన్యాసాశ్రమం స్వీకరించి, కంచి కామకోటి పీఠాధిపతిగా అభిషేకింపబడ్డారు. అప్పట్లో కొన్ని మఠ నిర్వహణ సంబంధమైన కారణాల వల్ల (1783లో సిద్ధిపొందిన 62వ శంకరాచార్య కాలం నుండి) మఠం ప్రధాన కార్యాలయం కంచి నుండి కుంభకోణానికి మార్చబడింది.

**కావాలి మనకు – పాత కొత్తల మేలు కలయిక** :

శ్రీస్వామివారి హయాంలోనే మఠం ప్రధాన కార్యాలయం కుంభకోణం నుండి కంచికి తిరిగి మార్చబడింది. పీఠానికొచ్చిన తరువాత శ్రీస్వామి 1909 నుండి 1914 వరకు మహాదేవ మంగళం అనే ప్రదేశంలో వేదశాస్త్ర పురాణేతిహాసాలలో విద్యాభ్యాసం, సాధనలో గడిపారు. తర్వాత దేశాటన, ఆధ్యాత్మిక ప్రబోధం! మఠ సంబంధమైన కార్యకలాపాలలో అవిశ్రాంతంగా నిమగ్నమయ్యారు. అయితే 1965లోనే పీఠాధిపత్యాన్ని వదలి, అంటే మఠానికి సంబంధించిన బాధ్యతలను తమ వారసునికి అప్పజెప్పి, అత్యాశ్రమివలే కేవలం దేశ సంచారం చేస్తూ, ఆధ్యాత్మిక ప్రబోధంలో నిమగ్నమై ఉన్నారు.

విదేశీయులు – 'మ్లేచ్ఛులనీ', వారిని చూడటం, వారికి దర్శనమివ్వడం అనాచారమనే ఛాందస మతాచార పరంపరలో – పాల్‌బ్రంటన్, ఆర్థర్ ఐసెన్‌బర్గ్, రాబర్టు వాల్సెర్, డానియల్ స్మిత్, ఆర్థర్ కోయిస్టర్ మొ॥న ఎందరో విదేశీయులకు ఇంటర్వ్యూలిచ్చి క్రొత్త ఒరవడి సృష్టించారు. సమర్థుడయిన గురువును అన్వేషిస్తూ దేశమంతా పర్యటిస్తున్న పాల్‌బ్రంటన్‌ను భగవాన్ రమణమహర్షిని



ఆశ్రయించమని సలహా చెప్పింది (1931లో) శ్రీపెద్దస్వామివారే. ఒకవేళ తాను గుర్వన్వేషణలో విఫలమైతే శ్రీస్వామివారు తనను శిష్యుడిగా స్వీకరిస్తారా అని బ్రంటన్ అడిగినప్పుడు శ్రీస్వామి, “నేను ఒక మఠాధిపతిని. నా సమయం నా స్వంతం కాదు. నాకున్న కాలమంతా మఠ నిర్వహణలోనే సరిపోతుంది. కొన్ని సంవత్సరాలుగా నేను మూడు గంటలకు పైగా నిద్రపోయింది లేదు. అలాంటప్పుడు నేను వ్యక్తిగతంగా శిష్యులను ఎలా స్వీకరించగలను? మీ కోసం తన కాలాన్ని వ్యయపరచగల మహాత్ముడి కోసం మీరు వెదకాలి!” అని సమాధానమిచ్చారు.

దాదాపు వారి జీవితమంతా అత్యంత సనాతన సంప్రదాయాల విధినిషేధాల మధ్య గడిచినా, ఆయనలోని స్వతంత్ర్యభావనా కుసుమం వసివాడిపోలేదని– ఆయన బోధనలు, ఆయన వ్యవహారసరళి పరిశీలిస్తే ఇట్టే బోధపడుతుంది. శ్రీస్వామి చాలామంది సాంప్రదాయక పండితుల్లా వేదశాస్త్ర పురాణేతిహాసాలపై ఆధునిక పండితుల, చరిత్రకారుల అభిప్రాయాలను గ్రుడ్డిగా త్రోసిపుచ్చరు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ విషయాలపై నిశితంగా శ్రీస్వామిని ప్రశ్నించిన బ్రంటన్, వారిని గూర్చి అంటారు “భారతీయ సంస్కృతి యొక్క గొప్పతనాన్ని చెప్పడానికి, పాశ్చాత్య సంస్కృతిని దూషించే వారి కోవలోకి శ్రీస్వామి రారని గ్రహించాను” అని. అరవిందాశ్రమవాసియైన దేవదత్ అనేవారు, “ఆధునిక విజ్ఞానం వల్ల ప్రాచీన సంస్కృతి నశించే పక్షంలో దానివల్ల ప్రయోజనం ఏమిటి?” అని ప్రశ్నించినపుడు, శ్రీస్వామివారు చెప్పిన సమాధానం “అన్నీ మన వేదాలలో ఉన్నాయి!” అని మూఢత్వంలో మురిసిపోయే ఛాందసులు గుర్తుంచుకోవలసినది. అప్పుడు శ్రీస్వామివారన్నారు: **“పురాణమిత్యేవ నసాధు సర్వం – ప్రాచీనమైనంత మాత్రాన దానినే సంపూర్ణంగా గ్రహించడం మన ఉద్దేశ్యం కాదు. ప్రాచీనతతోపాటు ఉత్తమమైన నవీనత్వాన్ని కూడా స్వీకరించడం మన పరమధర్మం. దేశంలోని ప్రతి యువకుడూ ఈ రెండింటి సమన్వయాన్ని సాధించడం కళ్యాణప్రదం. భారతీయ సంస్కృతిని రక్షించడం మా ధ్యేయం. అయితే ఆధునిక ప్రజా జీవనము, వారి ఆదర్శాలు, ఆకాంక్షలు కూడా గౌరవించి నవీనతను ఆహ్వానిస్తున్నాం”** అని. అంతేకాదు, సంకుచిత కులతత్వం రూపుమాపాలన్నది శ్రీస్వామివారి అభిమతం. కేవలం సనాతనమైనవి కనుక సతీసహగమనము, కులతత్వము మొ॥న మూఢాచారాలను, సాంఘిక దురాచారాలను సమర్థిస్తూ



ప్రచారం చేసి, 'పీటా'ధిపతులకు, ఆచార్యవర్యులకు, ఆ ప్రచారాలకు ఆనందంగా తలలూపే సనాతనులకు శ్రీస్వామివారి ప్రబోధం కనువిప్పు కావాలి!

**"జగద్గురు శ్రీచంద్రశేఖరేంద్రస్వామి వారికి సమకాలికులవడం మన భాగ్యం. ఆ భాగ్యం వారి దర్శనభాగ్యం కలుగనంతవరకు పూర్ణం కాదు" అంటారు – శ్రీస్వామి బోధనలను పదకొండు సంపుటాలలో "జగద్గురు బోధలు"గా ఆంధ్రీకరించిన శ్రీవిశాఖగారు. ఇంకా శ్రీస్వామివారిని దర్శించని సాధకులు ప్రస్తుతం కంచిలో ఉంటున్న శ్రీస్వామివారిని అవశ్యం దర్శించి ఆశీస్సులు పొందడం ఎంతైనా శుభప్రదం.**

***– సాయినాథుని శరత్‌బాబు*** *(సాయిపథం పూర్వసంచికలనుండి)*

## పదకవితా పితామహుని సద్గురు పదార్చన

పూజ్య గురుదేవులంటే తెలియని గౌరవభావం. సుమారు రెండు దశాబ్దాల పూర్వం గణపతితో మొదలయ్యి, వార విశేషాన్ని బట్టి హనుమను, అమ్మను, ఈశ్వరుడిని, నారాయణుడిని దర్శించుకుంటూ 'వార' ఫలాలను బేరీజు వేసుకునే కోవలో సాగే జీవితంలోనికి ఒక ప్రేమోత్పాతంగా ప్రభవించారు శ్రీబాబూజీ. ప్రేమ అంటూనే ఉత్పాతం అంటాడేమిటి? అన్నది కదా ప్రశ్న! నిజమే! కాలం చెల్లిన తంతులను ప్రశ్నిస్తుంటే అహం దెబ్బ తింటుంది కదా! 'కడలుడిపి నీరాడక' మునుపే, 'కాయం' కట్టెకు ఆహుతవ్వక మునుపే 'సద్గురువును' తెలుసుకొమ్మని చెప్పిన ఆత్మబంధువు కదా వారు! గజాననుని అవతార రహస్యాన్ని, మన పండుగలలో చేసే 'దండగ'ను, గొలుసు ఉత్తరాల 'గోల'ను నిర్ద్వందంగా నిరసిస్తూనే మాకు స్వచ్ఛమైన సాయిబాటను రాచబాటగా అందించిన గురుచంద్రులు కదా వారు. మా ఇంట్లో – వారి చిత్రపటాన్ని చూసిన ఎందరో హితైషులు నన్ను ప్రశ్నించేవారు – వారెవరని! వారిని సద్గురు సామ్రాట్ శ్రీసాయినాధునితో కలిపి పూజించుటలో ఆంతర్యమేమని! సూదంటు రాయివలే ఆకర్షించిన వారి రూపం, నిష్కర్షగా, నిర్మొహమాటంగా వారు తూర్పారబట్టే ఛాందస భావాలు, సమ్మోహనమైన మౌనంతోనే సాయితత్త్వాన్ని ఆచరించి చూపే వారి జీవనయానం, వజ్రసమానమైన వారి వ్యక్తిత్వం, సత్యం చెప్పడంలో రాజీపడని ధీరత్వం, విలువలకు పట్టం కట్టే వ్యవహారశైలి ఎంతో కొంత నన్ను వారికి దగ్గర చేసాయి. నిజానికి వారు మనకొసగిన అనుగ్రహఫలం

*(మిగతా 30వ పేజీలో)*

GURUKRUPA GRACEFUL 1997-2017 20 YEARS

# మనం ఎందుకోసం వచ్చాము?



మనం ఎందుకోసం వచ్చాము?

మనం ఏం సాధిస్తున్నాము?

మనం ఏం పొందుతున్నాము?

**గురుబంధువు :** గురువుగారూ! పరనిందా ప్రసంగాలు చెయ్యకుండా ఉండాలనుకున్నపుడు, దానికి ఎక్కువ ఆటంకాలు వస్తున్నాయి అవి పోవాలంటే ఏం చేయాలి?

**గురువుగారు :** దానికేం ఆటంకాలు వస్తాయయ్యా?

**గురుబంధువు :** ఎదుటివాళ్ళు అదే చేస్తూండేటపుడు...

**గురువుగారు :** వాళ్ళకు ఆటంకాలు వస్తాయి. నీకు కాదు కదా అవి! నీకు ఆటంకాలు ఏంటని? నువ్వు పరనింద చెయ్యకు. వాళ్ళు చేస్తే వాళ్ళు పోతారు. వాళ్లను ఫాలో అవ్వకు. నీకేంటి సంబంధం? ఎదుటివాడు పరనింద చేసాడు కనుక మనం చెయ్యాలి. వాడు చెయ్యకుండా ఉంటే నేను చెయ్యను అంటే ఎట్లా? పరనిందా ప్రసంగాలు నువ్వు చెయ్యకు. దానికి ఏం ఆటంకం కలిగింది? ఏం ఆటంకాలు వస్తాయి? పరనిందా ప్రసంగాలు చేస్తున్నాడంటూ, నువ్వు ఇప్పుడే చేస్తున్నావు పరనిందా ప్రసంగం.

మనకొక మోటు సామెత ఉంది. ఒక బ్రాహ్మణుడు సంతర్పణకు పోయాడట. బ్రాహ్మణ సంతర్పణ అయిన తరువాత ఏం చేస్తారంటే బాగా భోజనం పెట్టి, వెళ్ళేటపుడు ఒక పది రూపాయలు దక్షిణ ఇచ్చి పంపిస్తారు. అట్లాగే ఆయనకు కూడా దక్షిణ ఇచ్చారు. ఇచ్చేటప్పటికీ ఆయనకు విపరీతమైన కోపం వచ్చిందట. ముందు వాడికీ పదిరూపాయలిచ్చారు. ఈయనకూ పదిరూపాయలిచ్చారు.

**ఆత్మస్తుతి, పరనింద చేయని నాకూ, ఈ వెధవకూ ఒకే సంభావనా? అన్నాడట.** రెండూ ఉన్నాయి.

ఎదుటివాడు పరనింద చేసేస్తున్నాడండీ అందువల్ల నేను పరనిందా ప్రసంగాలు మానలేక పోతున్నాను అనంటూ మనం మానలేకపోవడం, వాడు చేస్తున్నాడని పరనింద చేయడం రెండూ జరిగిపోతున్నాయి.

కాబట్టి సాధ్యమైనంత వరకు మనకు అడ్డాలు రావు. అడ్డాలు బయట నుండి రావు. మనలో నుండే వస్తాయి. విమర్శించుకుంటూ పోవడమన్నది ఒక మాయలాంటిది. అటువంటి వాళ్ళందరూ



ఒక గూటి పక్షులలాగ ఒక దగ్గరికి చేరతారు – ఇలాంటి సర్కిల్స్‌లో జనరల్‌గా. ఊరికనే వాళ్ళ పనంతా ఏంటనంటే, ఊరికినే విమర్శిస్తూ ఉండటం అన్నమాట. వాళ్ళనీ, వీళ్ళనీ, అంతా కూడాను నెగెటివ్ థింకింగ్.

వాళ్ళేంటి అట్లా చేశారండీ? ఆ స్కూల్ కట్టారు కానీ, దానికి చాలా ఎక్కువ ఖర్చు పెట్టారు. నాకుగానీ అప్పచెప్పి ఉంటే అంత అయ్యుండేది కాదు. చాలా వేస్ట్ చేసారండి. అసలు ఎంత వేస్ట్ అని... ఎవరు తిన్నట్లు అదంతాను? మొత్తం బాబా డబ్బులు కదా, అలా చేస్తారటండీ?.

ఏం, నువ్వు వచ్చి కూర్చుని చెయ్యొచ్చుగా, వాడినెందుకు తిట్టడం? నిన్నేమన్నా చేయొద్దని అన్నారా? మనం చేయము, మనకు తెలిసినట్లుగా విమర్శలు చేయడం ఒకటి.

**బాబాకు అసహ్యమైన పని అది. ఇష్టంలేని పని కాదు.** ఆయన అసహ్యించుకునే పని చేస్తున్నావు. ప్రక్కన వాడిని విమర్శించడం, వాడు బాగా చేయలేదనుకున్నపుడు నువ్వు చేసి చూపించు. మనం చెయ్యము, చేసేవాళ్లని విమర్శిస్తుంటాము. అన్నీ నెగెటివ్ థింకింగ్‌లే.

గురువుగారి దగ్గర ఫలానా వాళ్లంతా చేరిపోయారండీ, ఇప్పుడు వాళ్లదే రాజ్యమంతా. ఈ రోజున వీళ్ళు చేరిపోయారండీ. ఈ రోజున వాళ్లదేనండీ రాజ్యం. వీళ్ళు ఎంత కాలం ఉంటారు? ఇటువంటి మాటలన్నమాట. **బాబా ముక్కు, చెవులు రెండూ ఇట్లా మూసుకుంటారు.** అటువంటివాళ్ళను చూస్తే **ఛీ ఛీ ఛీ** అంటారు. అట్లా ఆయన దగ్గర **'ఛీ'** అనిపించుకోవడానికి మీరు సిద్ధంగా ఉంటే చేయండి. నెగెటివ్‌గా విమర్శలు మాత్రం రాకూడదు.

ముఖ్యంగా మొదట మీరు సాయిపథంలో నేర్చుకోవాల్సింది ఏంటంటే... ఎప్పుడూ, ఎవ్వరినీ విమర్శించవద్దు. నెగెటివ్‌గా మాట్లాడవద్దు. నిజమైనా సరే! కాదండీ నిజం వాడికి ఉంది ఆ దుర్గుణం అంటాం. నిజమైనా సరే, నువ్వు గుర్తించవద్దు. బాబాకు ఎంత అసహ్యమంటే ఆయన ఇచ్చిన ఉదాహరణలో మనకు తెలుస్తుందది. ఇట్లాగే మాట్లాడేటటువంటి వాడిని, ఊరికినే విమర్శలు చేస్తూ, నెగెటివ్ థింకింగ్ చేసేవాడిని చూసి, వాడికి పందిని చూపించి చెప్పారది. **"ఒరే, ఆ పంది చేసే పనికి, నువ్వు చేసే పనికి తేడా లేదన్నారు".** బాబాకు తగ్గ బిడ్డలు కావాలనుకున్నప్పుడు ఆ పని మాత్రం చెయ్యకండి. అది మొదటి నియమం కావాలి. **ఆ దౌర్భాగ్యాన్ని, ఆ దుర్గుణాన్ని, ఆ అంటుజాఢ్యాన్ని మన సత్సంగం ఫ్యామిలీలోకి రానివ్వకండి.** మొట్టమొదటి నియమం అది పెట్టుకోండి.



వాటి జోలికి పోవద్దు.


**మనం 'ఎందుకోసం వచ్చాము? మనం ఏం సాధిస్తున్నాము? ఏం పొందుతున్నాము?' అనేటువంటి ప్రశ్న బాబాను, నన్ను కాదు అడగాల్సింది. మీకు మీరు వేసుకోండి. మేము వచ్చి సంవత్సరం అయింది గురువుగారు. మేము ఏం సాధించాము? నన్ను కాదు అడగాల్సింది, మీకు మీరు వేసుకోండి. నేను అడుగుతున్నా ఆ ప్రశ్న – ఏం సాధించారు? అని.**

నేనేమన్నా పిలిచానా రమ్మని. నా దగ్గరకు రండి, నేను ఉద్ధరించేస్తాను అని?. మిమ్ముల్నందరినీ పిలిచానా నేనేమన్నా? మీకై మీరు వచ్చారు. మీరు ఉద్ధరింపబడతాము అని చెప్పి, నాకు సహాయం చేయండి అనడిగారు. మీరు సహాయం పొందకుండా, మీరు అట్లాగే ఉండి నాకు మీరేం చేసారు అంటే? ఆ ప్రశ్న మీకు మీరు వేసుకోవాల్సిన ప్రశ్న అది. ప్రతిరోజూ వేసుకోండి నాలుగు సంధ్యల్లో వేసుకోండి. గంట గంటకూ వేసుకోండి. మీ ఓపికను బట్టి – అలారం పెట్టుకొని వేసుకోండి. మీ సెల్‌ఫోన్లకు అది ఒక రింగ్ టోన్ క్రింద పెట్టుకోండి. **ఎందుకొచ్చావు? ఏం చేస్తున్నావు? ఏం సాధించావు?** అని. (నవ్వులు)

**– శ్రీబాబూజీ**

## సద్గురుతత్వానికి ఆకారం శ్రీశరద్బాబూజీ!

సద్గురువులు పరమాత్ముని ప్రియపుత్రులు. భగవంతుడు తమ శక్తినంతా వీరికి ధారపోసి తమ ప్రతిరూపాలుగా మలచి ఈ లోకానికి ప్రత్యేక కార్యార్థమై పంపుతారు. మరో మాటలలో "సంభవామి యుగేయుగే" అని గీతలో చెప్పినట్లు, భగవంతుడే మానవజన్మ ఎత్తి సద్గురువు రూపంలో ఈ లోకంలో అవతరిస్తారు. అందుకే మనం గురువును బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులగానే కాక ఆ పరబ్రహ్మ స్వరూపంగా భావించి స్తోత్రం చేస్తాం. "గురువే అన్ని దైవాలు!" అని శ్రీసాయిబాబా చెప్పింది అందుకే. సద్గురువులు వారి కృపాకటాక్షాలతో శోకతప్తులైన మానవాళిని ఈ భవసాగరం నుండి తరింపచేసి శాశ్వత జీవనాన్ని ప్రసాదిస్తారు. అది వారి ఏకైక లక్ష్యం. మానవులను ఉద్ధరించడం తప్ప మరే పని వీరికుండదు. " అనుగ్రహించడమే నా పని!" (My Misson is to give Blessings) అని బాబా చెప్పిన దాని కర్థమదే !



సద్గురువులెప్పుడూ కొత్త మతాన్ని గానీ, సంఘాన్ని కానీ ఏర్పాటు చెయ్యరు. కర్మకాండల పట్ల, మతపరమైన సాంప్రదాయాల పట్లను వీరికి అభిరుచి ఉండదు. హంగులు, ఆడంబరాలంటే వీరికి గిట్టదు. సన్మానాలు, పూర్ణకుంభ స్వాగతాలు, పాదపూజలు భిక్షలనబడే విందు భోజనాలు (భ్రష్టభిక్ష) అసలే గిట్టదు. వీరికి కీర్తి ప్రతిష్టలనిన అభిలాష ఉండదు. వీరు మనలాగా సాధారణంగా కన్పిస్తారు తప్ప ప్రత్యేకమైన వేషభాషలుండవు. కాషాయంబరాలు ధరించరు. మతపరమైన బాహ్య చిహ్నాలేమీ ఉండవు. వారెప్పుడూ సరళమైన ప్రజలు మాట్లాడే వాడుక భాషలోనే మాట్లాడుతూ, వారు జన్మించిన మతాల్లోనూ, సంఘాల్లోనూ ఉంటూ భగవంతునన్వేషించమని ఉద్భోదిస్తారు. ఎలాంటి కర్మకాండలు చేయమనిగానీ, ప్రత్యేకమైన దుస్తులు ధరించమని గానీ, ప్రత్యేకమైన జీవన విధానాన్ని పాటించమనిగాని చెప్పరు. ఈ ప్రపంచాన్ని త్యజించమని, సన్యసించి ఒంటరిగా తపస్సు చేసుకోమని కూడా చెప్పరు. ఈ ప్రపంచంలోనే జీవిస్తూ, గృహస్థ జీవనాన్ని గడుపుతూ తమ విద్యుక్త ధర్మాన్ని నెరవేరుస్తూనే భగవంతుని సన్నిధికి చేరుకోడానికి మార్గాలు అన్వేషించాలని తెలియచేస్తారు.

సద్గురువులెన్నడు ఎవ్వరి నుండి ఒక్క పైసా కూడా పరిగ్రహించరు. అలా కాక ఎవ్వరినుండైనా ధనవస్తు రూపేణా ఏదైనా స్వీకరిస్తే అతడు భిక్షగాడవుతాడే తప్ప సద్గురువు కాలేడు. సద్గురువులు ఈ లోకానికి వచ్చింది దాతలుగా ఇవ్వడానికి మాత్రమే కానీ తీసికోడానికి కాదు. వారెప్పుడు తమ జీవితావసరాలకు అతిథి సత్కారాలకు స్వార్జితంపైనే ఆధారపడతారు. సద్గురువుల జీవిత చరిత్రలు చదివితే మనకది బోధపడుతుంది. సంత్‌కబీరు రాజులను, రారాజులను శిష్యులుగా కలిగి వుండి కూడా తన జీవితాంతం గుడ్డలు నేసి జీవించాడు. ఇలానే సంతనామదేవుడు, గురునానక్ కూడా! ఒకరు బట్టలకు రంగులద్దేవానిగా, మరొకరు కర్షకునిగా జీవించారు.

కమలము నీటిలో నున్నప్పటికి ఏ విధంగా తడవదో అదే విధంగా సద్గురువు ఈ ప్రపంచంలో జీవిస్తున్నప్పటికి అందులో లీనమవ్వకుండా ఉంటారు. ప్రపంచ వాసనలు, మోహబంధాలు వారినంటవు. అహంకారాన్ని దహింపజేసి, అరిషడ్వార్గాలను, ఇంద్రియాలను జయించి నిరాడంబరంగానూ, నిష్కళంకంగానూ జీవిస్తారు.

సద్గురువు భగవంతునివలె సర్వశక్తిమంతుడు, సర్వాంతర్యామి, సర్వజ్ఞుడు, సర్వవ్యాపి మరియు



త్రికాలదర్శి. తమ భక్తులను సర్వకాల సర్వావస్థల యందు వారి వెంటే వుండి కాపాడుతారు. తమ భక్తుడు సుదూర క్షేత్రాలలోనున్నా సప్త సముద్రాల ఆవలనున్నా తమను ధ్యానించిన వెంటనే అతనికి దృశ్యరూపమున ప్రత్యక్షమై అతనినాదుకుంటారు. బాబా తమ గురువు విషయమై చెప్పిన విధంగా, తాబేలు సముద్రపుటావలి ఒడ్డునున్న తన పిల్లల్ని ఏవిధంగా కేవలం తన ప్రేమదృక్కులతో కాపాడుతుందో అదే విధంగా గురువు తమ శిష్యులు ఎక్కడున్నా, ఎంతదూరంలో నున్నా తమ మనోనేత్రపు ప్రేమ వీక్షణాలతో వారిని రక్షిస్తూ కాపాడుతారు. సద్గురువులెప్పుడు జనులకు ప్రదర్శించడానికి మహిమలు చేయరు. వాటంతటవే సహజంగా జరుగుతుంటాయి. అంతేగాక సద్గురువులెప్పుడూ తాము మహిమలు చేసినట్లుగా ఒప్పుకోరు. తమకేమీ తెలియనట్లుగా నటిస్తూ అన్నీ ఆ భగవంతునికే ఆపాదిస్తారు. ఎప్పుడైతే సద్గురువు ఒకరిని తమ శిష్యునిగా స్వీకరిస్తారో ఆ క్షణమునుండి ఆ శిష్యుని బరువు బాధ్యతలన్నీ వారే తీసుకుంటారు. చేయవలసిందంతా వారే చేసి ఆ శిష్యుని చివరకంటా గమ్యం చేరుస్తారు. సద్గురువులు తమ శిష్యులను రక్షించడానికి వారి పాపకర్మలన్నీ తమపై వేసుకొని అనుభవిస్తారు. కానీ ఈ విషయం బయటకు పొక్కనివ్వరు. అసలు తాము భగవంతుడనే సత్యాన్ని వెల్లడిచేయకుండా అతి గుప్తంగా ఉంచుతారు. ఈ విషయం తెలిసిన తమ శిష్యులను కూడా వెల్లడి చేయకుండా కట్టుబాట్లు విధిస్తారు. వారెంతటి ప్రేమ స్వరూపులంటే తమ శరణాగతులు ఉద్ధరించడానికి విధి విధానాన్నే మారుస్తారు.

సద్గురువులకున్న మరో ప్రధాన లక్షణం సమదృష్టి, వీరికి జాతి, మత, కుల విచక్షణ గానీ, పేద, ధనిక బేధంగానే ఉండదు. వీరికి తరతమబేధ మసలే వుండదు. ఆడ, మగ, చిన్నా, పెద్ద అన్న తేడాలేవీ చూపక ఏకత్వభావంతో మెలగుతారు. అందరూ వీరి కన్నబిడ్డలే!

ఇక శిరిడీలో వెలసియున్న శ్రీసాయినాథుని శరద్బాబూజీగారి ప్రస్తావనకొద్దాం! బాబూజీగారొక అపూర్వవ్యక్తి. వీరు మనలాగే సామాన్యంగా కన్పిస్తారు తప్ప ప్రత్యేకమైన వేషభాషలుండవు. మతపరమైన బాహ్యచిహ్నాలు అసలే వుండవు. తెల్లటిపంచెను దట్టిగా ధరించి పైనొక బనీనులాంటి చొక్కా వేసుకొంటారు. భుజంపైనొక తుండుంటుంది. ఇది వారి రూపం! మతపరమైన సాంప్రదాయాలకు, కర్మకాండలకు విలువివ్వరు. వీరికి హంగులన్నా, ఆడంబరాలన్నా గిట్టవు. సన్మానాలు, పూర్ణకుంభ



స్వాగతాలు, పాదపూజలపై వీరికి అభిలాషలేదు. వీరు సరళమైన మనం మాట్లాడే భాషలోనే మాట్లాడుతూ తాము జన్మించిన మతాల్లోనే వుంటూ భగవంతుడినన్వేషించాలని ప్రబోధిస్తారు. ప్రపంచాన్ని త్యజించమనిగానీ, సన్యసించి తపస్సు చేసుకొనమని గానీ చెప్పరు. ఈ ప్రపంచంలోనే జీవిస్తూ, గృహస్థ జీవనం గడుపుతూ, ఎవరి విద్యుక్తధర్మాన్ని వారు నెరవేరుస్తూ శ్రీసాయిసన్నిధిని చేరుకోడానికి మార్గాలు అన్వేషించమని తెలియజేస్తారు.

వీరు ఏనాడూ ఎవ్వరి నుండి ఒక్క గుడ్డి పైసా అయినా స్వీకరించి ఎరుగరు. ధనం మీదున్న ధూళి సహితం వీరిని సోకడానికి సాహించదు. భక్తులు తమకు కానుకగా సమర్పించిన పండ్లు, ఫలహారాలు, ఇతర సామాగ్రి వగైరాలన్నంటిని బాబాకు సమర్పించి, ప్రసాదంగా తిరిగి భక్తులకే పంచుతారు. తప్ప కనీసం వాటిలో ఒక పండయినా స్వీకరించరు. తమ జీవితావసరాలకు, అతిధి సత్కారాలకు తమ స్వార్జితం (ఒంగోలులో తాము స్థాపించిన "సాయిబాబా సెంట్రల్ స్కూల్" నుండి నెల నెలా వచ్చు భృతి) పైనే ఆధారపడతారు. ఆశ్రమంలో నివసిస్తున్నప్పటికీ–తాము ఉంటున్న చిన్నగదికి బాడుగ కూడా ఆశ్రమ నిర్వాహకులకు చెల్లిస్తారంటే మనం ఆశ్చర్యపోనక్కరలేదు. సద్గురువులు ఈ లోకానికి వచ్చేది దాతలుగా ఇవ్వడానికేగానీ – తీసుకోవడానికి కాదనే సూక్తి వీరి విషయంలో పరమసత్యం. వీరు భక్తులడగగానే ఇవ్వడమే తప్ప తీసుకోవడమన్నది కల్ల. నిరంతరం భక్తులను అనుగ్రహించడమే వీరి పని. (His Mission is to give Blessings).

బాబూజీ గారు ఈ ప్రపంచంలో జీవిస్తున్నా ప్రపంచపు వాసనలు, మోహబంధాలు వీరినంటలేదు. అహంకారాన్ని నశింపజేసి, అరిషడ్వర్గాలను, ఇంద్రియాలను జయించి నిరాడంబర, నిర్మల, నిష్కళంక జీవనం గడుపుతున్నారు. సంతానము, ఆరోగ్యము, విద్య సంపదలు, పదవులు మొదలైన వాటినాశించి తమ దగ్గరికి వచ్చిన భక్తుల కోరికలన్నీ నెరవేరుస్తున్నారు. సర్వజ్ఞత ప్రకటిస్తున్నారు. ఎక్కడో ప్రపంచ మూలలలో తమ పటం ముందు కూర్చుని ఆర్తిగా ప్రార్థించిన భక్తుల ఆపదలు తొలగించి, వారి సమస్యలకొక పరిష్కారమార్గం చూపుతున్నారు. వైద్యశాస్త్రంలో అసాధ్యమైనవిగా ప్రకటితమైన కాన్సర్ లాంటి వ్యాధులను కేవలం ఊదీతోనే నయం చేస్తున్నారు. సంతాన ప్రాప్తి లేనివారికి సంతానం ప్రసాదించి విధీకృతాన్నే మార్చుతున్నారు. మూడు సంవత్సరాల నుండి మంచుకురియని సిమ్లా



అను నగరంలో తాము అక్కడ గడిపిన రాత్రి మంచుకురిపించి ప్రకృతి శక్తులపై తమ అధిపత్యాన్ని నిరూపించారు. ఇలా సాయిశక్తికి సజీవరూపమై ఎన్నో మహిమలు ప్రదర్శిస్తున్నారు.

అంతేగాక వీరు భక్తుల పాపకర్మలన్నీ తమపై వేసికొని అనుభవించి వారిని విముక్తుల్ని చేస్తున్నారు. అందుకే వారు సంవత్సరంలో మూడో భాగం అస్వస్థులై తీవ్ర జ్వరంలో బాధపడుతుంటారు. కానీ ఆ అస్వస్థత భక్తుల కర్మసంచితాల అనుభవ ఫలితమేననే సత్యాన్ని బయటకు పొక్కనివ్వరు. అంతేగాక తమ చెంతన జరిగే మహిమలు కూడా శ్రీసాయికే ఆపాదిస్తారు.

వీరి సమతా దృష్టి అపూర్వం. వీరికి అందరూ సమానమే జాతి, మతముల విచక్షణగానీ, పేద ధనిక బేధం గానీ లేక అందరిని సమానంగా చూస్తారు. ఇక్కడ చిన్న, పెద్ద, ఆడ, మగ తేడాలుండవు. తనపర బేధాలసలే వుండవు. తమను దర్శింప వచ్చిన వారెవరైనా సరే – దేశాన్ని పరిపాలించే పాలకులే కావొచ్చు. కోట్లకు పడగలెత్తిన కుబేరులే కావొచ్చు, కూటికి గతిలేని పరమ దరిద్రులే కావచ్చు. అందరూ ఒకే క్యూలో వెళ్ళివారిని దర్శించవలసినదే! ఎలాంటి ప్రత్యేకతలు చూపబడవు. పీడిత జన ఉద్దారణకే మొదటి ప్రాధాన్యత!

పై కధనాన్ని బట్టి శ్రీసాయినాథుని శరద్బాబూజీ సద్గురు ధర్మానికే ఆకారమని మనకు తెలుస్తుంది. అందువల్ల పాఠకులారా! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీగారి వద్ద శరణాగతి పొంది వారి ప్రేమకు పాత్రులై తరించండి. వారి ప్రేమకు పాత్రులవడానికి రెండే రెండు మార్గాలున్నాయి. **మొదటిది, నిరంతరం శ్రద్ధ, సబూరీలతో శ్రీసాయినాథుని ఆరాధించడం. శ్రీసాయినాథుని ప్రేమించడమంటే బాబూజీని ప్రేమించడమే. ఇద్దరూ ఒక్కటే కాబట్టి! ఇక రెండవది. వారు ఎలా అజ్ఞాపిస్తే అలా తు.చ. తప్పకుండా ఆచరించడం, వారు చెప్పినట్లు నడుచు.డం!**

– *సాయిదాసు* ***(8, జూన్ 2000 సం॥, కోవూరు. గురుకృప పూర్వసంచికల నుండి)***

## సమస్త అనుభవాలనిచ్చేది సద్గురు సన్నిధే!

మహనీయుడు గాని, మానవాతీతుడనిగాని, మహిమోపేతుడనిగాని కోర్కెలు తీర్చుస్వామి అనిగాని, తెలిసిందా! ఆర్తులు, అర్థార్థులు, ఊరుకుంటారా! గుంపులు, గుంపులుగా కొలువుంటారు. అటువంటి



మహాత్ముడు కాలినడక బాటవెంట జనం మధ్యలో నడిచివస్తే సామాన్య ప్రజానీకానికి పండుగే! ''నడయాడే దైవాన్ని'' అనుసరించేవారు కొందరుంటే, వారి పాదపద్మములపై పడి నమస్కరించేవారు కొందరుంటారు. ఆయన వేసిన అడుగులో అడుగు వేయాలని అర్రులు చాచేవారు కొందరు. గౌతముడు నడయాడినచోటు– పరమపవిత్రమైన చోటని, గౌతముని దర్శించిన చాలు సర్వకష్టాలు హరించుకు పోతాయని, జనం తండోపతండాలుగా గౌతమునితో తరలి వెళ్ళేవారు. అలాంటి సంఘటనే శిరిడీలో గురువుగారి చెంతన జరిగింది. 'సాయియానా'కు, గురువుగారు తామున్న ప్లాటు నుండి నడిచి వచ్చేవారు. సాయియానాకు ప్లాటుకు దూరం పెద్దగా లేకున్నా రావడానికి ఆలస్యం ఎందుకౌతున్నదో అర్థమైందనుకుంటాను. చూడాలని వచ్చేవారికి సాయియానా కంటే శిరిడీలోనే రోడ్డుమీద త్వరిగతిన దర్శనమైపోతుందనే భావన కొందరిలో బాగా కలిగింది. అటువంటి అర్థార్థులు అక్కడికక్కడే నమస్కారాలు గావించడం ప్రారంభమయ్యేసరికి ఇటువంటి వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. అర్థార్థుల కంటే అనుకరణానురక్తులు మరింత అధికమైనారు. వీరికి విషయావగాహన లేకున్నా అధిక సంఖ్యాకులైన జనావళి ఎందుకు నమస్కరిస్తున్నారో తెలియకపోయినా? మనదేం పోయింది! ఖర్చులేని నమస్కారమే గదా! వస్తే పుణ్యమొస్తుంది. అనే (భావనానుకరణ) భావనాకారులు ఎప్పుడైనా ఎప్పుడైనా ఎక్కువగానే ఉంటారు. వీరివలన జిజ్ఞాసువులకు, ఆధ్యాత్మికాభిలాషులకు, ఋజు మార్గ గమనాసక్తులకు అడ్డంకే.

సద్గురువు మహిమ ఇటువంటి వారిలో మార్పుతెప్పిస్తుంది. అంతవరకు నిజమైన ఆధ్యాత్మికానుభూతి పొందాలని తాపత్రయ పడేవారిలో ఎడబాటును సహించలేరు. ఆలస్యాన్ని అంగీకరించలేరు. అటువంటివారికై గురువు సదా తన సన్నిధిని అనుగ్రహిస్తుంటారు.

సద్గురుని స్వరూపము సదా కాంక్షించాలనే నిష్కాముని వైపునకే గురుగమనం సాగిపోతుంది. ఈతడెంతగా ఆరాటపడుతుంటే అంతకంతకు మించిన ఆరాటం ఆ సద్గురునిలో తొంగిచూస్తుంది. అప్పుడా గురువు ఎంత త్వరగానో వచ్చి ఆ ఆరాటకుని ఆనందపర్చుతారు. కానీ కాలికి పెనవేసుకొనిన తీగ నడకని సాగనివ్వని విధంగా అర్థార్థులు, అనుకరుణానురక్తుల నుండి బయటపడిరావాలంటే గురువు కూడా కొంత ఇబ్బందిని ఎదుర్కోవలసి వస్తుంది. ఇదో కోణములో కనిపించే రీతి, మరో



కోణంలో విమర్శకులు, భక్తిమాత్రోపజీవులు, అవిశ్వాసులైన కొందరు ఈ సన్నివేశాలను దర్శించి వారి స్థాయిలో మాట్లాడుకుంటారు.

ఈయనేమైనా దైవమా? దైవంకంటే ఎక్కువా? ఇలా బాట వెంటకూడా పాదనమస్కారాలా! ఈ కోవలో దైవదూషణం గావించి పాపానికి అతి చేరువవుతారు. ఈ విషయం తెలిసిన గురువుగారు వారికెలాంటి 'వాచా' దోషమంటరాదని ఆశీర్వదించుతారు. సందర్శనాభిలాషులు గురుదర్శనం కోసం ఆరాటపడుతు వేచి ఉంటారు. గురుగమనాన్ని సాగనీయక గంటల తరబడి బాటవెంట అర్థార్థులు నిలిపివేయడం వలన గంటల తరబడి ఆలస్యమవుతున్నది. ఒకవైపు విమర్శకులు, మరొకవైపు సందర్శకులు, మరోవైపు అర్థార్థులు! ఇటువంటి సమయంలో తన బిడ్డను అన్నిటి బారినుండి 'బాబా' చక్కగా సమన్వయపరిచారు. శ్రీమంతుడైన సాయిభక్తుడొకరు గురువుగారిని ప్రతీరోజు వారి వసతి గృహమునుండి సందర్శకులు వేచి ఉండే 'సాయియానా'కు కారులో తీసుకొని రావడానికి ఏర్పాటు జరిగింది. ఇది బాబా చూపిన బాటే! ఇలాంటి ఏర్పాటు జరిగినందువలన దారి వెంబడి దర్శనాలు, వారిని చూచి విమర్శించే విమర్శకులు, ఆలస్యంవలన కల్గే ఇబ్బందులెన్నో తొలగిపోయినవి. ఇలా కొంతకాలం గడిచింది.

రోజూ గురువుగారు 'సాయియానా'కు రావడం, వారిని కలవాలని ఆశీర్వచనాలు పొందాలనే సందర్శకుల కోర్కెలు తీర్చివేస్తున్నారు గురువుగారు. యంత్ర సంబంధమైనదిగా కారు! ఆ కారు చెడిపోయినది. దాన్ని వెంటనే హైదరాబాదుకు తరలించారు. రోజూ గురువుగారు కారులో వస్తున్నారు కదా! ఈ రోజు ఎలా వస్తారు. అనే సంశయం నాకు కలిగింది. పైగా యస్.వి.యల్. నారాయణరావు గారు అంతకుముందు రాత్రే అత్యవసర పని ఉండి వారి సోదరులైన విజయరామారావుగారి కారులో హైదరాబాదు వెళ్ళారు. నా ఉద్దేశ్యమేమంటే యస్.వి.యల్.గారుంటే గురువుగార్కి ఎలాంటి అసౌకర్యము లేకుండా కారుచెడిపోయినా మరోచక్కని ఏర్పాటు చేస్తారు. మరీరోజు భానుమూర్తిగారున్నారు. చూడాలి ఎలాంటి ఏర్పాటు చేస్తారోనని వేచి ఉన్నాను.

రాత్రి 8 గం॥లు దాటింది. గురువుగారు సాయియానాకు వస్తున్నారని తెలిసి గేటుదగ్గర నిలబడ్డాను. రోజూ కారులో వస్తున్నట్టు – గురువుగారు ఆ రోజు ఎలా వస్తున్నారో చూడాలని కుతూహలంగా ఉన్నాను. ఆటో ఒకటి వస్తున్నది. అందులో ఎందుకుంటారు! ఎవరో గురుదేవుల ఆశీర్వాదమునకు



వచ్చేటి వాళ్ళని, కారుకోసమే చూస్తున్నాను. సరిగ్గా నా ముందు ఆగిన ఆటోలోంచి గురువుగారు కనిపించారు. ఆశ్చర్యము, ఆనందము, నా అహంకార విమోచనము ఏకకాలంలో కలిగినది.

అది వరకు కారులో వచ్చేటప్పుడు ఎంతో గంభీరంగాను, కాలుమీదకాలు వేసుకొని వచ్చినట్లుగానే గురువుగారు ఆటోలోనూ అంతే గంభీరంగాను, ఇంకా మరింత హుందాగాను వచ్చారు. ఇక్కడ ఆశ్చర్యము. మెత్తని కారు సీటులో వెనుకభాగంలో దర్జాగా ఆనుకొని వచ్చినట్లుగానే, ఆటోలోను అంతే. మట్టిని, బంగారాన్ని సమానదృష్టితో చూచేవాడే యోగి పుంగవుడనే గీతా వాక్యం పదే పదే గుర్తుకు వచ్చింది. ద్వంద్వాతీతులు– మహనీయులనే యదార్థాంశము నా కంటిముందు కదలాడింది. ఆశ్చర్యమే ఆశ్చర్యం.

'రఘువంశ' కర్తయగు కాళిదాసు 'రాముని' విషయంగా 12వ సర్గలో ఇలా వ్రాసారు. "రామా! నీకు తెల్లవారితే రాజ్యాభిషేకము అని చెప్పారట. ఆ మరుసటి దినము నీవు అరణ్యవాసానికి బయలుదేరాలన్నారట. రాజ్యాభిషేకము అన్నప్పుడు రాముడు పొంగిపోవడం కాని, ఆనంద పడటముగాని జరుగలేదు. అరణ్యవాసానికి సిద్ధం కావాలని చెప్పినప్పుడు క్రుంగిపోవడంకాని, విచారపడటం కాని జరుగులేదు. ఈ రెండు లక్షణాలు రాముని ముఖములో స్పష్టంగా దృగ్గోచరమైనదని" చెప్పిన స్థితిని, స్వయంగా కాళిదాసు చెప్పిన భావాన్ని చూచే భాగ్యం నాకు లభించింది. ఆ సమయంలో ఆనందం కలిగింది.

'స్వామి సమర్థ' (అక్కల్ కోట) ఒకరోజు దర్శనాలిస్తున్న సమయంలో స్వామి గుఱ్ఱుపెట్టి నిద్రపోతున్నారట. వచ్చిన భక్తులు వారి పాదాలకు నమస్కరించి వెళ్ళిపోతున్నారు. దర్శనాలకు వచ్చినవారిలో, స్వామి అంటే ఇలా వేళాపాళా లేకుండా ఇట్టా నిద్దురపోతారా? ఇతనేం స్వామి అనుకున్నాడట. వెంటనే స్వామి!! "ఒరేయ్ కంసలోడా! నేను నిద్దపోలేదురా! మేల్కొనే ఉన్నానని", స్వామి మరలా గుఱ్ఱుపెట్టారని చరిత్ర చెప్పింది. ఇది గుర్తుకు వచ్చేసరికి అహంకార విమోచనమైంది.

'వ్యక్తిత్వపు విలువలు' అన్న భావన నీకు స్పష్టంగా అర్థమైందిగదా? అన్నట్లుగా నా వంక చూసి నా శిరముపై చేయివేసి ఆశీర్వదించి నవ్వుతూ లోనికి వెళ్ళారు గురువుగారు. మహనీయుల సన్నిధిలో ఎన్నో అనుభవాలు, అనుభూతులు సాధకుడు పొందగల్గుతాడు.

*– డా॥ఎస్.సాయివరప్రసాదరావు – ఆ చేయి ఎంత హాయి (గురుకృప పూర్వ సంచికల నుండి)*

## బాబాపైనే దృష్టి నిలుపు



**నువ్వు సత్సంగానికి బాబా కోసంగా పో** వాళ్ళు ఎన్ని గంటలకు వస్తారనే దృష్టి నీకెందుకు. నీకేమిటి సంబంధం, బాబా దగ్గర గంటసేపు, కూర్చోవాలా అనుకొని Interest ఉండేవాళ్ళు వెళతారు. ప్రక్కనవాడు ఎన్ని గంటలకు వస్తున్నాడు? వాడు చివరలో వస్తున్నాడా? దానిపై దృష్టి పెట్టకండి. పచ్చిగా చెప్పాలంటే Mind your own business (మన బిజినెస్ ఏంటి? బాబా మీద ఫోకస్ చేయడం, ఫోకస్ చేయండి). ప్రక్కన వాడు ఎట్లా వస్తున్నాడు? ఏం చేస్తున్నాడు? మనకెందుకు అవి? మనకేమిటి సంబంధం అసలు. ఆలోచించుకోండి. మనం దాంట్లో ఏం కల్పించుకోవద్దు. ఎవరెవరు ఎక్కడ నిలబడలా, ఎక్కడ కూర్చోవాలా అన్న విషయాలలో కల్పించుకోవద్దు. **మీ దృష్టి బాబా మీద పెట్టండి ...** అంతే. తెలియకుండానే తప్పుపట్టడమనే అలవాటు మనకొస్తోంది. మనం కరెక్ట్ చేస్తున్నాం– ప్రక్కన వాడు తప్పు చేస్తున్నాడు అనేటువంటి feel రావడంవల్లే ఇది కలుగుతోంది. ప్రతి ఒక్కడూ అలాగే అనుకుంటుంటాడు. నేను కరెక్టుగా చేస్తున్నాను, ప్రక్కన వాడే తప్పు చేస్తున్నాడని. వాడి తప్పు మీదనే బుర్రపెడుతున్నావు.

ప్రక్కన వాడి లోపాలు వెతకడానికి ప్రయత్నం చేస్తున్నావు. అది బాబా ఎంత గట్టిగా తిట్టారో మీకు తెలుసు. ఆ పని మనమెందుకు చేయాలి? **ఆ వరాహచర్య మనమెందుకు చెయ్యాలి?** ప్రక్కన వాడి మీద దృష్టి పెట్టకండి. వాడేం చేస్తున్నాడో మన కొద్దు, మనం సత్సంగానికి పోయేది బాబా గురించే, బాబా మీద దృష్టి పెట్టండి–వచ్చేసెయ్యండి. అంతే! అందరూ అలాగే చేయండి. అప్పుడు ఇబ్బంది లేదు. ప్రక్కన వాడిని కరెక్ట్ చెయ్యాలి అనుకున్నప్పుడే ఇబ్బందులొస్తున్నాయి. మనమెవరం ప్రక్కన వాడిని కరెక్టు చేసేదానికి ?

**సత్సంగాలు మీలో సానుకూల దృక్పథాన్ని పెంచుతున్నాయా లేదా, ఒకసారి ఆలోచించుకోండి.** చూసేదానికి సత్సంగం పట్ల ఎంతో ఆర్తి, ఆసక్తి ఉన్నట్లు కనిపిస్తాయి. చూసేదానికి మాత్రం అవి ఎంత మోసం చేస్తున్నాయో మిమ్మల్ని.

గురువుగారి దగ్గరకు వెళ్ళాము – గురువుగారు మాకు ఈసారి ఇంటర్వ్యూనే ఇవ్వలేదు. "మాకు ఇంటర్వ్యూ అవసరం అయితే గురువుగారు ఇస్తారు. ఆయనకి తెలియదా"? "మీరంతగా నన్ను



చూడాలనుకుంటున్నారు. నిజంగా మీకంత ప్రేమ నా పట్ల ఉంటే, నాకు మీ పట్ల అంత ప్రేమ ఉండదామ్మా! మిమ్మల్ని చూడాలని నాకు ఉంటుంది".

నాకు ఇంటర్వ్యూ ఎందుకు ఇవ్వలేదో! గురువుగారికి తెలుసు. నాకవసరమైతే ఇస్తారు. పిలిచారు. సంతోషపడాలి. పిలవకపోయినా అంతే – అక్కడ కూర్చున్నాం, విన్నాం, వచ్చేస్తాం.. అవి పోయినాయి, ఈ రోజున వాళ్ళని పిలిచారే, మమ్మల్ని పిలవలేదు. నన్ను పిలవడం కంటే వాడిని పిలిచారన్నది పెద్ద పాయింట్ ఇక్కడ. ఈయన బాధ అదన్నమాట. అసలు ఆఖరుకు ఎట్లా తయారయ్యిందంటే అదేదో కథ చెప్పినట్లు తయారయింది చూస్తావుంటే. వాడికంటే మనది ఎప్పుడూ రెట్టింపు ఉండాలి –అంతే. వాడికి సత్సంగం ఇవ్వకపోయినా ఫరవాలేదు, నాకు ఇవ్వలేదు కనుక వాడికి కూడా ఇవ్వకూడదు, అంతే. ఇవ్వకపోతే ఎవ్వరికీ ఇవ్వకూడదు– లేకపోతే ఇద్దరికీ ఇవ్వాలి! మీకు 'రెండుకళ్ళ' కథ తెలుసుగా! ఇద్దరూ ఇట్లాగే తపస్సు చేసారట. ఒకరికొకరు పోటీ అన్నమాట. తపస్సు చేసిన తరువాత ఒకడికి భగవంతుడు ప్రత్యక్షమైనాడట, ఏం కావాలిరా, ఎందుకు ఇట్లా ఏడుస్తున్నావురా, ఏంది నీ కథ అన్నాడట. నా గురించి నాకేమీ ప్రాబ్లమ్ లేదు, ప్రక్కన వాడి గురించే నా ప్రాబ్లమ్ అంతా కూడాను. నాకటువంటి స్వార్థాలేం లేవు. ముందు వాడిని అడగండి, పాపం వాడికి కావాల్సినది ఇవ్వండి. అయితే వాడికేం ఇస్తే నాకు రెండింతలివ్వండి అన్నాడట. ఆయన పోయి, వాడిని అడిగాడట, ఏరా! నీకేం కావాలి అన్నాడట, నా గురించి నేనేమి ఆలోచించుకోవడం లేదు. వాడేం అడిగాడో చెప్పండి అన్నాడట. నువ్వు ఏవి అడిగితే దానికి రెట్టింపు ఇవ్వమని అడిగాడు. అయితే భగవంతుడా! నాకు ఒక కన్ను తీసేయండి అన్నాడట. వాడికి రెండు కళ్ళుపోతాయికదా! అది వీడి పాయింటు. ఇట్లా ఉంటుంది. ఎప్పుడూ దృష్టి ప్రక్కన వాడి మీదనే ఉంటుదన్నమాట. అందుకే ఇందాక నేను చెప్పింది. ప్రక్కన వాడి మీద దృష్టి పెట్టకు, వాడు ఆలస్యంగా వస్తున్నాడా, ముందుగా వస్తున్నాడా, అది చేస్తున్నాడా, ఇది చేస్తున్నాడా, అవి మనకొద్దు. **బాబా మీదనే దృష్టి పెట్టండి.**

**– శ్రీబాబూజీ**


**సాయి సమగ్రదర్శిని : www.saibaba.com     సద్గురు తత్త్వ దర్శిని : www.gurukrupa.info**

**గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన mail ID : gurukrupa@saimail.com**



*(17వ పేజీ తరువాయి)* ఏమని ప్రశ్నించేవారు తక్కువే! ఎందుకంటే వారు మనందరి జీవితాలను తీర్చిదిద్దిన తీరు దర్శనీయమే కదా! సరే అసలు విషయానికి వస్తాను. సంకీర్తనాచార్యునిగా, పద కవితా పితామహునిగా కీర్తించబడి, ప్రతీ తెలుగింటిలోనూ తన పదాలతో తిరువేంకటనాథుని పాదాలకు అర్చనా కుసుమాలను సమర్పించిన అన్నమాచార్య స్వామివారు సుపరిచితులే కదా! సుమారు 32వేల సంకీర్తనా కుసుమాలు, ద్వాదశ శతకాలను, ద్విపద కావ్యంగా రామాయణాన్ని మరెన్నో రచనా విశేషాలతో భగవత్ కైంకర్యం గావించిన అన్నమాచార్య స్వామి మనందరికీ ఇంట్లోవాడని, భగవత్ పదబంధువని మీతో పంచుకోవడం అతిశయోక్తి కాదు. అయితే అన్నమాచార్యుని పదార్చన ఎక్కువగా వేంకటాచలాధిపుని కీర్తించడంగా అందరికీ తెలుసు. ఇదిగో ఈ క్రింది కీర్తనలో అన్నమయ్య చెపుతారు తమ గురుస్వరూపం తమకు ఎలాంటి హితాన్ని చేకూర్చిందో! సద్గురుపథాన్ని ఆశ్రయించుకున్న సద్భక్తులకు – సద్గురువైభవం తెలియటానికా అన్నట్లు ఈ కీర్తన రచించింది – అన్పిస్తుంది. ఈ కీర్తనను అర్థం చేసుకుంటే కొన్ని శతాబ్ధాల పూర్వం అన్నమ్యయ్య అక్షరానుభూతి ఏమిటో, నేడు మనందరికీ శ్రీబాబూజీ అందించిన అక్షయపాత్ర ఏమిటో – నిజానికి మనకెట్టి పాత్రత ఉందో గమనింపుకొస్తుంది. **కీర్తి సద్గురుచంద్రునిది – అక్షరకీర్తి అన్నమయ్య స్వామిది – అక్షయపాత్ర ఆశ్రయించిన జీవులది. మనమూ పొందాలని తపిద్దాం – అవధరిద్దాం.**

***ప॥ జ్ఞానయజ్ఞమీగతి మోక్షసాధనము । నానార్థములు నిన్నే నడిపె మా గురుడు***

***॥చ॥ అలరి దేహమనేటి యాగశాలలోన। బలువై యజ్ఞానపు పశువు బంధించి ।***
***కలసి వైరాగ్యపు కత్తుల గోసి కోసి । వెలయ జ్ఞానాగ్నిలో వేలిచె మా గురుడు***

***॥చ॥ మొక్కుచు వైష్ణవులనే ముని సభ గూడపెట్టి । చొక్కుచు శ్రీపాదతీర్థ సోమపానము నించి ।***
***చక్కగా సంకీర్తన సామగానము చేసి । యిక్కువతో యజ్ఞము సేయించెబో మా గురుడు***

***॥చ॥ తదియ్యగురు ప్రసాదపు పురోడాశమిచ్చి । కొదదీర ద్వయమను కుండలంబులు వెట్టి ।***
***యెదలో శ్రీవెంకటేశ – నిటు ప్రత్యక్షము చేసి । ఇదివో స్వరూపదీక్ష ఇచ్చెను మా గురుడు ॥***




రామానుజాచార్యులవారు తన బిడ్డడైన అన్నమయ్యకు నాలుగు పురుషార్థాలను ప్రాప్తి నొందేందుకు పలు విధాల దారి చూపి మార్గదర్శనం చేయించాడని కీర్తిస్తున్నాడు పై కీర్తనలో. కేవలం సంకల్ప మాత్రం చేతనే సకలము ప్రసాదించగల సద్గురువు తన బిడ్డలను పరిపూర్ణులుగా మార్చే క్రమంలో సాధన, సత్సంగం, సంకీర్తన, శ్రవణం, మననం ఇలా ఎన్నో మార్గాలను ఉపకరణాలుగా ప్రసాదించి మోక్ష పదానికి (సద్గురు చరణాలకు) చేరుస్తాడు. మా గురువుగారు శ్రీబాబూజీ శ్రీచరణులు తమ జీవిత పర్యంతం మమ్ము పరిపరివిధాలుగా శ్రీసాయి చరణాలను చేర్చే ప్రయత్నం చేస్తూ ఆశీర్వదిస్తూనే ఉన్నారు. సదా సాయిఊసు, సాయిధ్యాసలో గడిపేందుకు వారు చూపిన అమూల్యమైన, భిన్నమైన ఉపకరణాలే మాకు ఊతంగా నిలుస్తున్నాయి సాయిపథంలో.

ఇందు మరో మర్మం కూడా దాగి ఉంది. పురుషార్థాలను సాధించుకునే క్రమంలో గుప్తంగా ఉండిపోయిన మార్గాలను కూడా వెల్లడి చేసారు తమ గురుదేవులంటాడు అన్నమయ్య. పూజ్య గురుదేవులు తమ సాధనా సంపత్తినంతా, గుదిగుచ్చి–ఆహార, విహార నియమాల నుండి ఉపాసనా విధుల వరకు సమగ్రంగా మనకు మార్గనిర్దేశనం చేసారు – సాయిభక్తి సాధనా 'రహస్య' వాణితో.

పూర్వకాలంలో యజ్ఞమును నిర్వహించి ఇహపరశ్రేయస్సుకై యజ్ఞ పశువును బలిగా సమర్పించి కోర్కెలను సిద్ధించుకునేవారు. అన్నమాచార్యస్వామి అంటారు "బలమైన అజ్ఞానపు పొరలు నిండిన మానవదేహమనే యజ్ఞ పశువును 'వైరాగ్యమ'నే కత్తులతో కోసి కోసి జ్ఞానమనే అగ్ని కీలలలో దగ్ధం చేసి మమ్ము పవిత్రులను చేసారు మా గురుదేవులు" అని. అసూయను జయించడం అంత సులువా? అని ప్రశ్నిస్తూ "కారే రాజ్యముల్... అన్న భాగవత పద్యాన్ని ఉదహరిస్తూ అనిత్యమైనటువంటి సంపద కోసంగా ఎన్ని అంతరాలు సృష్టించుకుంటున్నామో తెలియచెప్తూ పూజ్యగురుదేవులు చేసింది – చేస్తోంది నిత్యయజ్ఞమేనిపిస్తుంది. తమ జీవిత పర్యంతం – బిడ్డల అజ్ఞానాంధకారాలను పటాపంచలు చేస్తూ సత్యమైన సాయిపథాన్ని చూపడంలోనే, యజ్ఞఫలంగా అందరినీ సాయి చరణాలను చేర్చడంలోనే అంకితమయ్యింది వారి జీవితం.

ఒక క్రమపద్ధతిలో ఈ జ్ఞానయజ్ఞాన్ని నిర్వహించాడు తమ గురుదేవులంటారు అన్నమాచార్యులు. వైష్ణవ మహాత్ములందరి ఆశీస్సులను అర్థించి వారి చరణాలను సేవించి, సుజలాలతో వారి చరణాలను



కడిగి, ఆ పాదతీర్థాన్ని స్వీకరించమని తెలియచేసారు వారి గురుదేవులంటాడు అన్నమాచార్యస్వామి. యజ్ఞంలో 'సోమ' వృక్షాన్ని దేవతలకు సమర్పించి సోమరసాన్ని పానం చేసే కార్యంతో పోల్చాడు సంకీర్తనాచార్యుడు. అంతేకాకుండా భగవత్ గుణ విశేషాలను ప్రేమపూర్వక సంకీర్తనగా సామగానము చేయించి, మాకు దారి చూపాడంటాడు. 'సత్' సాంగత్యానుభవం పొందేందుకు సదా సత్స్వరూపులైన మహాత్ములను లక్ష్యశుద్ధితో ఆశ్రయించమని, వారి ప్రత్యక్ష సన్నిధి లభించనపుడు వారి జీవిత చరిత్రలను శ్రద్ధగా అధ్యయనం చేస్తూ వారి దివ్య సన్నిధిని పొందమని మా బోంట్లను భగవాన్, శేషాద్రిస్వామి, పూండీస్వామి, చంద్రశేఖరుల వంటి ఎందరో సద్గురుచంద్రుల సన్నిధికి పంపి, వారి చరణతీర్థాన్ని మాకు అందించారు మా గురుదేవులు. భక్తజన హృదయాబ్జభృంగమై అంటూ శ్రీసాయికీర్తిని మాకు తెలియచెపుతూ, గుండెలోతుల నుండి 'సాయి'ని పిలిచే తీరును, నిశ్శబ్ధ నిశీధిలో విన్పించాల్సింది 'సాయి' అన్న నామమే నంటూ ప్రేమతో మార్గదర్శనం చేసారు వారు.

యజ్ఞనివేదనగా సమర్పించే 'పురోడాశ'మనే ప్రసాదాన్ని జ్ఞాన ప్రసాదంగా అందచేసారు రామానుజులు. నన్ను వారు చేరదీసి "శ్రీమన్నారాయణ చరణం శరణం ప్రపద్యే - శ్రీమతే నారాయణాయ నమః" అన్న రెండు మంత్రాలను కుండలములుగా ప్రసాదించారు. అంతేకాదు, నా హృదయమందిరాన వేంకటేశుని సుప్రతిష్టం చేసి ఇదిగో నాకు స్వరూపదీక్షనొసగారు మా గురుదేవులు అని కీర్తించారు అన్నమాచార్య స్వామి. శ్రద్ధ-సబూరీలనే కుండలాలను శ్రీసాయి ప్రసాదిస్తే - బాబాపట్ల భక్తి, ప్రేమలే మనకు దారి చూపాలని తెలియచేసారు గురుదేవులు పూజ్యశ్రీబాబూజీ. ఈనాడు ఆధ్యాత్మికత పేరున డబ్బు దండుకుంటూ, స్వరూపదీక్షలంటూ కొత్తపుంతలు త్రొక్కుతోంది సమాజం. తామున్న ప్రాంగణం నుండి సాయినాథుని సన్నిధి వరకు ఏ ఒక్కరితోనూ సంగము లేక తన కన్నుల నిండా శ్రీసాయినే నింపుకొని - సాయిపథ ప్రాంగణాన బిడ్డలందరి హృదయమందిరాలలో శ్రీసాయిరూపాన్ని సుప్రతిష్టం చేసి సాయి స్వరూప 'దీక్ష'ను ప్రసాదించిన సాధనా తపస్వి శ్రీబాబూజీ.

శతాబ్దాల పూర్వం అన్నమాచార్యులవారు తమ గురుదేవుల చెంత ఏమి పొందారో, నేడు శ్రీబాబూజీ తమ చెంతకు చేరిన వారందరికీ అదే అనుగ్రహఫలాన్ని అందరికీ పంచుతున్నారు. అందుకే అంటారు **శ్రీబాబూజీ "మౌలికమైన ఆధ్యాత్మిక సూత్రాలు ఎన్నటికీ మారవు" అని.**

**- కంద్రిక సూర్యనారాయణ**

(శీర్షికలోని అభిప్రాయాలు రచయిత వ్యక్తిగతమైనవి.)



# గురువు - దైవము

సృష్టి మొత్తము భగవత్ స్వరూపంగా భగవంతుని వ్యక్తరూపంగా (అంతటా అన్నిటా ఉన్న బాబాను) దర్శించుట యోగదృష్టికి చిహ్నము. సృష్టియందలి సర్వాకారములు, సర్వకరములు (నేను అహంకార, నాది మమకారాదులు), సర్వగుణములు, సర్వచేష్టలు సృష్టి పరిణామమందలి విభాగమని (జరుగుతున్నదంతా బాబా సంకల్పానుసారమే జరుగుతుందని) దర్శించుట జ్ఞానదృష్టి. ఈ రెంటిని ప్రసాదించువారే గురువు.

మానవుడిని (దైవంగా) దివ్యునిగా ఎదిగించేందుకు గురువుగా మానవదేహాన్ని ధరించి (తేది 7-10-1954) దర్శన, స్పర్శన, సరస, సల్లాప, సంతోష సుబోధనలను వ్యక్తంచేసి, దేహాతీతునిగా (తేది 13-11-2010) వారి ద్వారా ప్రకటమయ్యే మహాత్మ్య ప్రభావం ఇంకా ఎక్కువ అవుతుంది. ఆ గురుమూర్తిని త్రికరణశుద్ధిగా (దైవంగా) స్మరించువారికి తమ సాన్నిధ్యమును ప్రసాదిస్తూ తమంతవానిగా చేయును. అట్టి గురుచరణాలను ఆశ్రయించడం అంటే వారి పద్ధతులను పాటించడంగా, ఆ పాటించడంలో ఆయన వారిగా, అనుసరణే ఆయన వారి కర్తవ్యం. ఆ కర్తవ్య నిర్వహణే **నిజమైన ఆరాధన.** అట్టి గురువుని, గురుదేవులను మరువగలమా, మరువతరమా?

## మరువగలమా! మరువతరమా!

తన తనువు అందరికీ అర్పించిన
అణువణువూ విశ్వాత్మకు సమర్పించిన
విశాలాత్మను...పవిత్రాత్మను
మరువగలమా! మరువతరమా!
ఎవరికేమి చెప్పాలో... అది చెప్పేవారిని...
ఎవరికేమి చెయ్యాలో అది చేసేవారిని
ఎవరికేమి ఇవ్వాలో అది ఇచ్చేవారిని
మరువగలమా! మరువతరమా!
కలికాలమున చూపించు నవ్యలీలలు..
కలకాలము చూపించు దివ్యలీలలు..
నిత్యము వెదజల్లు కరుణారసము
హాస్యములో వ్యక్తమగు రహస్యము
మరువగలమా! మరువతరమా!
చెప్పలేని అనుభూతులు చెబుదామనుకుంటే...
వ్రాయలేని అనుభవాలు వ్రాద్దామనుకుంటే
ఏమని చెప్పాలి - ఎంతని వ్రాయాలి...
అదంతా ఆనందస్థితి - అనంతమైన రసానుభూతి
మరువగలమా! మరువతరమా!
మరువలేము! మరువలేము!
తన తనువు అందరికీ సమర్పించిన....
అణువణువు విశ్వాత్మకు అర్పించిన
విశాలాత్మను, పవిత్రాత్మను
మరువలేము! మరువలేము!

**-గురుకృప**

GURUKRUPA GRACEFUL 1997-2017 YEARS



# మనతో, మనలో ఉన్నారు

కనులు తెరవని పసిగుడ్డు... తల్లి స్పర్శ కోసం
తడుముకున్నట్లు
నా గురువు సన్నిధి కోసం తపించిపోయా...
అల్లారు ముద్దుగా చూసుకునే తల్లి కనబడకపోతే తల్లడిల్లిపోయే బిడ్డలా
నా గురువు ప్రత్యక్ష సన్నిధికోసం అల్లాడిపోయా...
నిద్రలో లేచి... 'అమ్మా, అమ్మా' అని పలవరించే బిడ్డలా ...
నా గురువు సన్నిధి కోసం పలవరించా...
తప్పటడుగుల సమయాన చేయి పట్టి నడకను...
తప్పొప్పులు దిద్దే వేళ చెవి పట్టి నడతను నేర్పి...
దారి చూపిన తండ్రికి నేర్చుకున్న నడకను...
నడవడికను చూపుదామని తిరిగి చూస్తే కంటికి కనిపడని
ఆ తండ్రి కోసం కుమిలిపోయే బిడ్డలా ...
నా గురువు దర్శనం కోసం... పొగిలి పొగిలి ఏడ్చా...

వదిలి వెళ్ళిపోయారే నన్ను దిక్కులేనివాడిని చేసి అని అల్లాడిపోయాను మొదట...
ఏ దిక్కున చూసినా నను గమనిస్తూ రక్షిస్తున్నారని తెలిసింది తరువాత...
అంతలా ప్రేమను పంచి అలా వదలి వెళ్ళిపోవడానికి మనసెలా వచ్చింది ఆయనకు అని అలిగాను మొదట... అసలు ఆయన వదిలింది ఎక్కడ అని అర్థమయ్యింది తరువాత...

ఏం ఆయన లేకపోతే బతకలేనా అనుకున్నా, వెళ్ళిపోయారన్న ఉక్రోషంతో మొదట... అసలు బతుకుతోందే ఆయన మీద ఆధారపడి అని అర్థమయ్యింది తరువాత...
ఎక్కడికెళితే మరలా కనిపిస్తుందో నా గురువు రూపం అని ఎంతో తపన పడ్డాను మొదట.... ఆయన ఎక్కడికీ వెళ్ళలేదని అర్థమయింది తరువాత.

– శేఖర్, చెన్నై

## పదాలు - సన్నిధి (WORDS & PRESENCE)

సాయిపథం అని అంటే వారానికి ఏడు అధ్యాయాలు చదవడం, ఇన్ని అగరువత్తులు పెట్టడం, ఇన్నిసార్లు తిప్పడం ఇవి కాదు. It's a way of Life, way of our understanding. ప్రపంచం పట్ల, మీపట్ల, మీ చుట్టూ ఉండే వాళ్ళపట్ల వచ్చేటటువంటి మార్పు, మన దృక్పథంలో వచ్చేటటువంటి మార్పు అదీ సాయిపథం.

సాయి అంటే ఆనందం, 'నన్ను ఆనంద స్వరూపంగా ధ్యానించు' అన్నాడాయన. సాయి అంటే ఆనందం, పథం అంటే మార్గం. **This is a path of Happiness.**

మనం ఆనందంగా ఉన్నామా లేదా అని చూసుకుంటూ, మనం ఎప్పుడూ ఆనందంగా ఉండటం సాయిపథంలో ఉన్నట్టు లెక్క.

దుఃఖం వస్తుంటుంది, డిస్ట్రబ్ అవుతుంటుంది. ఎందుకు డిస్ట్రబ్ అవుతున్నాం మనం? ఇది నిజంగా రీజనబులేనా, నిజంగా అవసరం ఉందా, నిజంగా అంత కష్టం వచ్చిందా నాకు, ఒక్కసారి ఆలోచించుకోండి మీకు మీరు, వదిలిపోతుంది, మళ్ళావస్తుంది, మళ్ళీ ఆలోచించుకోండి, మళ్ళీ పోతుంది. ఈ **విచక్షణ కావాలి, ఆ ఆలోచన కావాలి, ఆ వివేకం కావాలి.** మీరేదన్నా చేస్తే అది చెయ్యండి. అదీ నిజమైన సత్సంగం అంటే. ఇట్లా ఎవరెవరు అందరూ చేసినటువంటి నలుగురు కూర్చుని, పదిమంది కలసి కూర్చుని, హ్యాపీగా అందరూ కలిసి ఒక పార్టీ చేసుకోవడం లాంటిది సత్సంగం అంటే. Sharing your joy and Happiness.

-శ్రీబాబూజీ



# సద్గురు స్వరూపం ఆలయం... వారి కరుణ హిమాలయం...



1918కి ముందు కూడా బాబా తమ దేహానికి పరిమితమై లేరు, ఎందుకంటే బాబానే స్వయంగా "నా ముర్షద్ (గురువు) నన్నేనాడో ఈ దేహం నుండి విడుదల చేశారు. ఎవరైతే ఈ దేహాన్నే సాయిబాబా అనుకుంటారో వారు సాయిబాబాను అసలు చూడనట్లే" అని చెప్పారు. తమ దేహం నుండి ఆయన అప్పటికే విడుదలయ్యారు. కనుక నిజానికి ఆయన దేహం ఒక సమాధి - కొద్దిమందితో వ్యవహరించగల పరిమితమైన కదలాడే ఒక చిన్న సమాధి. ఆయన ప్రేమస్వరూపులు, భక్తుల పెరుగుతున్న అవసరాలు తీర్చాలనుకున్నవారు కనుక, భక్తులు ఆయనతో వ్యవహరించడానికి ఒక ఆలంబన కావాలి. కనుక తరువాత ఆయన మారవలసి వచ్చింది. అందుకని ఆయన తమ సమాధిని మార్చుకున్నారు. ఆ సమాధి (ఆయన భౌతిక శరీరం) నుంచి తమ దేహం యొక్క ఆకారం యొక్క పరిధిని పెంచి ప్రస్తుతం ఉన్న సమాధికి మారారు. అందుకనే ఆయన, "నా సమాధి మాట్లాడుతుంది, నా సమాధి కదులుతుంది, నా సమాధి సమాధానం చెబుతుంది" అన్నారు. అంతకుముందు ఆయన భౌతికదేహం సమాధానమిస్తూ ఉండిన రీతిలోనే.

ఓ మహాత్ముని మరణం - అది మరణం అని అనుకుంటే - కొంతమంది మహాత్ముల విషయంలో వారి మహిమ మరియు వారి అవతార కార్యం యొక్క విస్తృతికి నిదర్శనం. అందువల్ల వారు దేహత్యాగం చేసిన రోజును సంతాప దినంగా కాక ఉత్సవంలా జరుపుకుంటారు. ఒకవేళ మహాత్ముని మరణానికి సంతాపం పాటించవలసి వస్తే అసలు ఆయన మహాత్ముడే కాదు, కారణం **మహాత్ములకు మరణం అంటూ ఉండదు** కనుక. అందుకే దానిని వర్ధంతి అంటారు. వర్ధ అంటే పెరిగేది, విస్తరించేది, వికసించేది - పెరగడం అన్నమాట. దేహత్యాగంతో భౌతికమైన పెరుగుదల ఆగిపోవచ్చు, కానీ వారి ద్వారా ప్రకటమయ్యే మహాత్మ్య ప్రభావం ఆగిపోదు (ఇంకా ఎక్కువవుతుంది) కాబట్టి వాస్తవానికి ఆయన మరణించలేదు. - **శ్రీబాబూజీ**